

- విజయవాడను అనుకుని ఉన్న పెనమలూరు, గన్నవరం మండలాలను 70 కిలోమీటర్ల దూరంలోని మచిలీపట్నం కేంద్రంగా కృష్ణాజిల్లాలో కలిపారు.
- గన్నవరంలో ఉన్న విజయవాడ విమానాశ్రయాన్ని కృష్ణాజిల్లాలోకి తీసుకెళ్లడంతో విజయవాడ దగ్గరగా ఉన్నప్పటికీ.. 80 కిలోమీటర్ల దూరంలోని మచిలీపట్నం నుంచి అధికారులే ఇక్కడికి వచ్చి ప్రొటోకాల్ విధులు నిర్వర్తిస్తున్నారు.
- విజయవాడ, మచిలీపట్నానికి దగ్గరగా ఉన్న నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఏలూరు జిల్లాలో ఏకం చేశారు. ఇప్పటికీ వారి పరిధి ఎక్కడో తెలియక ఈ రెండు ప్రాంతాల ప్రజలు తలలు పట్టుకుంటున్నారు.

ఈ ఉదాహరణలన్నీ మచ్చుకు కొన్నే. ఉమ్మడి కృష్ణాజిల్లా స్వరూపాన్ని మార్చేసేలా గత వైసీపీ ప్రభుత్వం జరిపిన పునర్విభజన అటు అధికార యంత్రాంగం, ఇటు ప్రజానీకాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. దగ్గరలో ఉన్న ప్రాంతాలను దూరంగా, గజిబిజిగా మార్చి విభజనను ఓ విధ్వంసంగా మార్చారు. ప్రజలు, రాజకీయ పక్షాల అభ్యంతరాలు, భౌగోళిక పరిస్థితులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండానే కృష్ణాజిల్లాను ముక్కలు చేశారు. నాటి సీఎం జగన్ నిర్వాకం వల్ల ఏ ప్రాంతం ఎటువైపో తెలియని అనిశ్చితి ఇప్పటికీ కొనసాగుతోంది.

ఆంధ్రజ్యోతి పరిశీలన

అటో.. ఇటో.. ఎటో..!

కృష్ణాకు ప్రభుత్వ ఆఫీసులే లేని దీనావస్థ

- ఉద్యోగుల సర్వీసు నిబంధనలు ఉమ్మడి జిల్లాలోనే..
- గన్నవరం ఎయిర్‌పోర్టుపై అంతా గందరగోళం
- విజయవాడకు దగ్గర, మచిలీపట్నం నుంచి విధులు
- 'ఎన్టీఆర్'కు దగ్గరలోని పెనమలూరు, గన్నవరం 'కృష్ణా'లోకి..
- నూజివీడు, కైకలూరు కూడా ఏలూరు జిల్లాలోకి..
- విజయవాడ రూరల్ మండలం గ్రామాలు ఎటువైపో..

కృష్ణాజిల్లా విభజన గజిబిజి గందరగోళం

- వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో తొలగని అవస్థలు
- రెండున్నరేళ్లయినా పరిష్కారం కాని సమస్యలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం/విజయవాడ : గతంలో 16 అసెంబ్లీ నియోజకవర్గాలు, మూడు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఉమ్మడిగా ఉన్న కృష్ణాజిల్లాను.. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలుగా విభజించారు. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఏలూరు జిల్లాలో విలీనం చేసి.. కృష్ణాకు 7, ఎన్టీఆర్‌కు 7 అసెంబ్లీ నియోజకవర్గాలు చేశారు. మచిలీపట్నం, విజయవాడను పార్లమెంట్ స్థానాలుగా యథావిధిగా ఉంచారు.

తక్కువ కేడర్ అధికారులే..

ఈ రెండున్నర జిల్లాల్లో ఉద్యోగుల బదిలీలు, ఇతరత్రా అంశాలకు సంబంధించి కృష్ణా కలెక్టరే పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఉద్యోగుల బదిలీలు, ఇతరత్రా పరిపాలనా పరమైన అంశాలకు సంబంధించి ఎన్టీఆర్, ఏలూరు మిగతా 6లో..

అద్దె భవనాలే దిక్కు

కృష్ణాజిల్లాలో కీలకమైన నీటిపారుదల శాఖ ఎస్ఈ పోస్టును ఎన్టీఆర్ జిల్లా పరిధిలోనే ఉంచారు. విజయవాడ నుంచే ఈ శాఖకు సంబంధించిన పరిపాలన కొనసాగుతోంది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు ఈ ఎస్ఈ ద్వారానే పరిపాలనను నెట్టుకొస్తున్నారు. సర్వశిక్ష అభియాన్, గృహనిర్మాణ శాఖ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ కార్యాలయం, బీసీ కార్పొరేషన్, అటవీశాఖ, పరిశ్రమలు, దేవదాయ శాఖ, మార్కెటింగ్ శాఖ, భూగర్భ, గనుల శాఖ, ఖనిజ శాఖ, భూగర్భ జల అధికారి కార్యాలయం, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్.. తదితర కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఈఈ, డీవైఈవో కార్యాలయాలను నోబుల్ కళాశాల ఎదురుగా ఉన్న పాతభవనంలో నడుపుతున్నారు. విద్యుత్ శాఖ ఎస్ఈ, ఈఈ కార్యాలయాలను, మచిలీపట్నం డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయంలో నడుపుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కృష్ణాజిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లా వేరుపడినట్టుగా చూపి, కృష్ణా పేరుతో కృష్ణాజిల్లాను పాతజిల్లాగా పరిగణించి, ఆయా కార్యాలయాల భవనాల నిర్మాణానికి ఇంతవరకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. కలెక్టర్, జేసీ కార్యాలయాలను కొంతమేర ఆధునికీకరించి సరిపెట్టారు.

సిబ్బంది.. పెద్ద ఇబ్బంది..!

ప్రభుత్వ కార్యాలయం అంటే జిల్లాస్థాయి అధికారి, ఆయన వద్ద పూర్తిస్థాయిలో కార్యాలయ సిబ్బంది, కారు, ఇతరత్రా హంగామాలు ఉండాలి. కిందిస్థాయి, సిబ్బందితో పాటు కార్యాలయంలో సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, బిళ్లబంట్రోతులు ఉండాలి. కానీ, ప్రస్తుతం వీరెవరూ లేరు. కలెక్టర్, జేసీల వద్ద కూడా ఈ సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో వేరే ప్రాంతంలో పనిచేసేవారిని డిప్యూటేషన్‌పై తెచ్చుకుంటున్నారు. గతంలో జెడ్పీ సీఈవోకు జిల్లాపరిషత్ ప్రాంగణంలోనే బంగ్లా ఉండేది. ఈ బంగ్లాను వేరే కార్యాలయానికి ఇచ్చేయడంతో ఆయన ఎక్కడ నివాసం ఉండాలో తెలియని పరిస్థితి ఏర్పడింది.

మధ్యస్థంగా విజయవాడ రూరల్

విజయవాడ రూరల్ మండలం చిత్రమైన పరిస్థితికి నిదర్శనంగా నిలిచింది. ఈ మండలం పరిధిలో 16 గ్రామాలు ఉండగా, ఇవన్నీ ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఉన్నాయి. కానీ, రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో అంతర్భాగంగా మారాయి. గూడవల్లి, నిడమానూరు, ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు, నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాలు గన్నవరం అసెంబ్లీ, మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోకి వస్తాయి. కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, షైదూరుపాడు, రాయనపాడు, గొల్లపూడి, రామరాజ్యనగర్, వైఎస్సార్ గ్రామాలు మైలవరం అసెంబ్లీ, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. కానీ, ఇవన్నీ విజయవాడ రూరల్ మండలాలు. విజయవాడ నగరానికి దగ్గరగా ఉన్నవే.

గన్నవరం ఎయిర్‌పోర్టు గందరగోళం

గన్నవరం ప్రాంతాన్ని కృష్ణాజిల్లాలో విలీనం చేయటం వల్ల విజయవాడ విమానాశ్రయం కృష్ణాజిల్లా పరిధిలోకి వెళ్లిపోయింది. వాస్తవానికి ఇది విజయవాడ విమానాశ్రయం. విజయవాడ అంటే ఎన్టీఆర్ జిల్లా. కానీ, విమానాశ్రయం పరిధి కృష్ణాజిల్లాలోకి వస్తుంది. ఇక్కడ ప్రొటోకాల్ విధులు నిర్వహించటానికి ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగానికి తేలిగ్గా ఉంటుంది. కానీ, 80 కిలోమీటర్ల దూరంలోని మచిలీపట్నం నుంచి ఉన్నతాధికారులు రావాల్సి వస్తోంది. ఇది దూరాభారం.







యనమలకుదురులో జనసేన నేత కబ్జా చేసేందుకు ప్రయత్నించిన స్థలం

భూమాఫియాపై ఉక్కుపాదం మోపుతామని ఓవైపు ప్రభుత్వ పెద్దలు ప్రకటనలు చేస్తుంటే.. మరోవైపు కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. యనమలకుదురులో సుమారు రూ.20 కోట్ల విలువైన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన విజయవాడ తూర్పు నియోజకవర్గ జనసేన నాయకుడి ప్రయత్నాలను స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అనుచరులు అడ్డుకున్నారు.

కబ్జాకోరలు

యనమలకుదురులో రూ.20 కోట్ల భూమి కబ్జాయత్నం

- సూత్రధారి తూర్పు నియోజకవర్గ జనసేన నేత
- అడ్డుకున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అనుచరులు
- జనసేన నేతపై గతంలోనూ భూకబ్జా ఆరోపణలు
- విజయవాడలో 4.. గుంటూరులో 3 కేసులు నమోదు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : కానూరుకు చెందిన ముప్పవరపు గణేశ్‌కు యనమలకుదురులోని రీసర్వే నెంబరు 47/5లో సుమారు 71 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని విజయవాడలో ప్రముఖ వస్త్ర దుకాణదారుడైన వేమూలూరి నాగభూషణం (చంటి) 2019లో కొన్నారు. వ్యాపార లావాదేవీల్లో భాగంగా ఇది జరిగింది. సుమారు ఆరేళ్ల తర్వాత ముప్పవరపు గణేశ్ తిరిగి ఆ భూమి తమదేనంటూ స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడంతో వివాదం మొదలైంది. భూ వ్యవహారాల్లో తలదూర్చి సెటిల్‌మెంట్లు చేయడంలో ఆరితేరిన జనసేన నాయకుడు ఈ వివాదాన్ని తనకు అనుకూలమైన విధంగా మార్చుకునేందుకు రంగంలోకి దిగాడు. నవంబరు 20వ తేదీ అర్ధరాత్రి యనమలకుదురులోని వివాదాస్పద స్థలంలోకి ప్రవేశించి కంటైనర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు స్తంభాలు పాతారు. సమాచారం తెలిసిన వెంటనే చంటికి చెందిన మనుషులు స్తంభాలను తొలగించడంతో పాటు కంటైనర్‌ను స్థలం నుంచి బయటకు తరలించేశారు. దీంతో జనసేన నేత తన అనుచరులు 20 మందితో అక్కడికి చేరుకుని తిరిగి స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడంతో పాటు చంటికి ఫోన్‌చేసి బెదిరించారు. చంటి.. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు సమీప బంధువు కావడంతో ఆయన ద్వారా స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఇరువర్గాలు వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లతో వస్తే పరిశీలించి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. చంటి తన వద్ద ఉన్న అన్ని పత్రాలను ఎమ్మెల్యేకు చూపించగా, జనసేన నేత మాత్రం ఎలాంటి పత్రాలను తీసుకురాలేదు. పైగా చంటికి ఫోన్‌చేసి టీడీపీ ఎమ్మెల్యేల దగ్గరకు వెళ్తే భయపడతామా.. అంటూ బెదిరింపులకు దిగాడు. ఎమ్మెల్యే అనుచరులు రంగప్రవేశం చేసి జనసేన నేత అనుచరులను స్థలం నుంచి పంపేసి, ఏమైనా వివాదాలు ఉంటే కోర్టులో తేల్చుకోవాలని, ఇలా బలవంతంగా భూమిలోకి ప్రవేశించి ఆక్రమించుకోవడం సరికాదని స్పష్టం చేశారు.

భూబాగోతాలు ఎన్నెన్నో..

గతంలోనూ నకిలీ పత్రాలతో భూమిని కబ్జా చేయబోయారంటూ జనసేన నేతపై పలు కేసులు నమోదయ్యాయి. 2021, ఆగస్టులో గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఆగతవరప్పాడులో సుమారు రూ.10 కోట్ల విలువైన 1.42 ఎకరాల భూమిని నకిలీ దస్తావేజులతో కబ్జా చేసేందుకు ఈయన ప్రయత్నించాడు. ఈ కేసులో అమ్మిశెట్టి వాసుతో పాటు మరో ఆరుగురుని పోలీసులు అరెస్టు చేశారు. కానూరుకు చెందిన లారీ ట్రాన్స్‌పోర్టు యజమానిని మోసం చేసిన ఘటనలోనూ ఈయనపై కేసు నమోదైంది. గవర్నర్‌పేట, సూర్యారావుపేట, భవానీపురం పోలీసుస్టేషన్లలోనూ ఈయనపై నాలుగు కేసులు నమోదు కాగా, రెండు కేసులు ఇంకా కోర్టులో నడుస్తున్నాయి. గుంటూరు జిల్లాలో మూడు కేసులు నమోదు కాగా, ఒక కేసులో శిక్ష పడింది. జనసేన నేత తీరుపై సొంత పార్టీలోనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌తో ఈయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది.

కత్తిపూడి-మచిలీపట్నం జాతీయ రహదారి అభివృద్ధికి కేంద్రం అనుమతి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కత్తిపూడి నుంచి మచిలీపట్నం జాతీయ రహదారి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మొదటి విడతగా 229 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిని విస్తరించడంతో పాటు రాజధాని అమరావతి అవుటర్ రింగురోడ్డుకు అనుసంధానం చేయాలని నిర్ణయించింది. బందరు పోర్టు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్న ఈ సమయంలో జాతీయ రహదారి అభివృద్ధి అంశం కీలకం కానుంది. ఈ రహదారి విస్తరణకు త్వరలోనే టెండర్లు పిలిచే అవకాశం ఉంది. కాగా, కత్తిపూడి నుంచి మచిలీపట్నం జాతీయ రహదారి అభివృద్ధికి కేంద్ర అనుమతి ఇవ్వడంపై మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి చొరవ తీసుకోవడం వల్లే ఇది సాధ్యమైందన్నారు.

వణికిస్తున్న వాన



చల్లపల్లిలో భారీ వర్షం

జిల్లాపై ఫెంగల్ తుఫాను ప్రభావం

- ఎక్కడికక్కడే నిలిచిపోయిన ధాన్యం నిల్వలు
- మిల్లులకు ధాన్యపు వాహనాల క్యూ
- ధర తగ్గించి కొంటున్న వ్యాపారులు
- ఇప్పటివరకు లక్ష టన్నుల కొనుగోలు
- జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీవర్షం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఫెంగల్ తుఫాను ప్రభావానికి జిల్లావ్యాప్తంగా వర్షం కురుస్తూనే ఉంది. తుఫాను తీరం దాటడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి వరకు తేలికపాటి వర్షాలు కురిశాయి. రైతులు వరికోతలను నిలిపేసి, ధాన్యాన్ని కాపాడుకునే పనిలో పడ్డారు. మచిలీపట్నం, గుడివాడ, కంకిపాడు, తదితర ప్రాంతాల్లో ధాన్యం లోడుతో మిల్లుల వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. దీంతో వ్యాపారులు బస్తా రూ.1,420, రూ.1,400 తగ్గించి కొంటున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలోని మిల్లులకు ట్యాగింగ్ నిలిపివేత

వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఇతర జిల్లాల్లోని మిల్లులకు ధాన్యం విక్రయించుకునేందుకు అధికారులు రైతుసేవా కేంద్రాల ద్వారా ట్యాగింగ్ చేశారు. ఉయ్యూరు డివిజన్‌లోని మండలాల నుంచి పశ్చిమగోదావరి జిల్లాలో మిల్లులకు సంబంధించిన ట్యాగింగ్ ఆదివారం మధ్యాహ్నం నుంచి నిలిచిపోయింది. దీంతో జిల్లాలోని మిల్లుల వద్ద ధాన్యం లోడుతో వాహనాలు నిలిచిపోతున్నాయి. కాగా, మిల్లర్లు చాలావరకు ధాన్యం మిగతా 6లో..

ఫెంగల్ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు ఆదివారం కూడా జిల్లాను వదల్లేదు. ఉదయం నుంచి కురుస్తున్న మోస్తరు వర్షం రైతులను పరుగులు పెట్టించింది. ఫలితంగా మిల్లుల ముందు ధాన్యపు వాహనాలు బారులు తీరి కనిపించాయి. కానీ, జిల్లాలోని చాలావరకు మిల్లులు మూతపడటంతో ఏం చేయాలో తెలియని అన్నదాత తల పట్టుకుంటున్నాడు.



కపిలేశ్వరపురంలో నేలవాలిన వరి

పనిచేయలేను

- కలెక్టర్ ముందు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అసహనం
- ఏఈలు లేకుండా అసాధ్యమని వెల్లడి
- డీఆర్‌సీ సమావేశంలో గోడు వెళ్లబోసుకున్న వైనం

ఇతరశాఖల నుంచి భర్తీ చేయిస్తానని కలెక్టర్ హామీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగాన్ని ఏఈల కొరత వేధిస్తోంది. ఉమ్మడి జిల్లా ఎస్ఈ కార్యాలయంలో ఒక్క ఏఈ కూడా లేరు. ఇక సబ్ డివిజన్ల కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. ఒక్క ఏఈ కూడా లేకపోవటంతో పనులను ఎలా ముందుకు తీసుకెళ్లాలో తెలియక ఉమ్మడి జిల్లా ఎస్ఈ (సూపరింటెండెంట్ ఇంజనీర్) విద్యాసాగర్ తల పట్టుకుంటున్నారు. శనివారం జరిగిన డీఆర్‌సీ సమావేశంలో ఆయన తన ఆవేదనను కలెక్టర్‌కు చెప్పుకొన్నారు. ఒక్క ఏఈ కూడా లేకపోవటం వల్ల తాను పనిచేయలేకపోతున్నానన్నారు. డీఈఈ నుంచి ఈఈ పదోన్నతి పొందిన విద్యాసాగర్ ఎస్ఈ పోస్టుకు కూడా ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. భారం ఎక్కువ కావడంతో ఈయన ఏ పనీ చేయలేకపోతున్నారు.

విచ్చలవిడి డిప్యుటేషన్ల వల్లే..

జల్ జీవన్ మిషన్ (జేజేఎం) వంటి కీలకమైన పనులను ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం సిబ్బంది లేకుండా చేయడం కష్టమైన పని. పంచాయతీల్లో కీలకమైన ఈ పనులు.. తగిన సంఖ్యలో ఏఈలు, డీఈఈలు లేకపోతే ముందుకు కదలవు. ఇష్టారాజ్యంగా జరిగే అవకాశం ఉంటుంది. కాగా, ఎస్ఈ గోడు విన్న కలెక్టర్ లక్ష్మీశ.. ఇతర డిపార్ట్‌మెంట్ల నుంచి ఏఈలను రప్పిస్తానని హామీ ఇచ్చారు. అయితే, గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలో అవినీతి కారణంగానే ఈ సమస్య తలెత్తింది. ఇక్కడ ఉద్యోగుల బదిలీలు, డిప్యుటేషన్ల పేరిట భారీగా వసూళ్లు చేస్తున్నారు. సంస్థలో సిబ్బంది తగిన సంఖ్యలో లేరని తెలిసినా.. డిప్యుటేషన్లపై సిబ్బందిని మరో శాఖకు పంపిస్తున్నారు. డిప్యుటేషన్లకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. దీంతో ఏఈలు, డీఈఈల కొరత పీడిస్తోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 50 ఏఈ పోస్టులు ఉండగా, జూలై వరకు 30 మంది పనిచేసేవారు. మిగిలిన 20 ఖాళీగా ఉండేవి. ప్రస్తుతం ఖాళీల సంఖ్య 30కు చేరింది.

కొత్త రేషన్‌కార్డులకు నేటి నుంచి లాగిన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అర్హులైన వారికి కొత్త రేషన్‌కార్డులు జారీ చేసేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సోమవారం నుంచి ఈ ప్రక్రియ మొదలుకానుంది. ఇప్పటి వరకు రేషన్‌కార్డులు లేని అర్హులైన వారితో పాటు ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయిన వారు కూడా అక్కడి కార్డు నుంచి పేర్లు తొలగించుకుని స్ప్లిట్ కార్డులు పొందొచ్చు. వివాహానికి ముందు తల్లిదండ్రుల కార్డులో పేర్లు ఉన్నవారు కూడా ఈ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. రేషన్ కార్డులో పేర్లు యాడ్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పిస్తున్నారు. ఆధార్ నెంబర్లు తప్పుగా అనుసంధానమైనా సరిచేసుకోవచ్చు.



మృతదేహానికి నివాళులర్పిస్తున్న జనసేన నేత బండి రామకృష్ణ

బలరామునిపేటలో విషాదఛాయలు

- కంకిపాడు ప్రమాద మృతులకు నివాళి

6లో



దుర్గగుడి 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఆలయ ఈవో రామారావు

కేంద్ర నిధులతో దుర్గగుడి అభివృద్ధి పనులు

» మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడి

వన్‌టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రసాద్ (పిలిగ్రిమేజ్ రిజువినేషన్ స్పిర్చ్యువల్ అగుమెంటేషన్ డ్రైవ్, తీర్థయాత్ర పునర్జీవనం ఆధ్యాత్మిక వృద్ధి డ్రైవ్) టెంపుల్ స్కీమ్ ఆధ్వర్యంలో దుర్గగుడి అభివృద్ధికి నిధులు విడుదల చేయనున్నట్టు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం మహామండపంలో మాస్టర్ ప్లాన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో గతంలో కొంతపని జరిగినా.. కొన్ని కారణాల వల్ల మధ్యలో ఆగిపోయిందని, మరలా ఇప్పుడు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ను వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. టెంపుల్ టూరిజం స్కీమ్‌లో దుర్గామల్లేశ్వర దేవస్థానం కూడా ఉందన్నారు. వీలైనంత ఎక్కువ నిధులు రాబట్టేందుకు ఎంపీ చొరవ తీసుకోవాలన్నారు. క్యూలు, వెయిటింగ్ రూమ్‌లు, కాటేజీలు, తదితరాల గురించి సమావేశంలో చర్చించినట్టు తెలిపారు. భక్తులకు అమ్మవారి దర్శనం సులభతరంపైనా చర్చించామన్నారు. జనవరి చివరినాటికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసి ముఖ్యమంత్రితో సమీక్షించి పూర్తిస్థాయిలో అమలు చేయటానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ, దుర్గగుడిలో రద్దీ దృష్ట్యా దీర్ఘకాలం పాటు అమలులో ఉండేవిధంగా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, ఈవో కె.ఎస్.రామారావు, దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ జీ.వి.ఆర్. శేఖర్, ఈఈలు కె.ఎస్. కోటేశ్వరరావు, పి.వైకుంఠరావు, టూరిజం శాఖ ఈఈ, సాంకేతిక కమిటీ సభ్యుడు పాండురంగారావు, డిఈఈలు, ఎఈఈలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను మంత్రి పరిశీలించారు.



ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి కార్తీకమాసం, అమావాస్య ఆదివారం కావటంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పొంగళ్లు సమర్పించారు. వివిధ ఆర్జిత సేవల్లో పలువురు పాల్గొని పూజలు చేశారు. క్యూలలో పరిస్థితిని ఈవో రామారావు, ఇతర అధికారులు పర్యవేక్షించారు. ఆదివారం దేవస్థానం అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. సమస్త జనుల ఆయురారోగ్యాలను కోరుతూ సంకల్పం చెప్పి అరుణ పారాయణ తదితర సేవలను నిర్వహించారు. పాయకాపురానికి చెందిన జి.రామిరెడ్డి పండ్ల వ్యాపారి జి.రామిరెడ్డి, కుటుంబ సభ్యులతో ఆదివారం అమ్మవారిని దర్శించుకుని, అనంతరం అన్నవితరణ నిమిత్తం రూ.1,00,000ల చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు.



నార్ల వెంకటేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గోళ్ల నారాయణరావు తదితరులు

పాత్రికేయులకు సేవా పురస్కారాలు

విజయవాడ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : లోక్‌నాయక్ జయప్రకాష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన పాత్రికేయులకు నగదు పురస్కారాలు అందచేయనున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. సీనియర్ సంపాదకుడు నార్ల వెంకటేశ్వరరావు 118వ జయంతి సందర్భంగా తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్ర ఆవరణలో ఆదివారం నార్ల జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 21 సంవత్సరాల క్రితం లోక్‌నాయక్ ఫౌండేషన్ స్థాపించి వివిధ రంగాల్లో లబ్ధప్రతిష్ఠులైన వారికి పురస్కారాలను అందచేస్తున్నామన్నారు. మేధావుల సూచన మేరకు ఇకపై ప్రతిభ కలిగిన పాత్రికేయులను పట్టణ, నగర, గ్రామీణ స్థాయిలో గుర్తించి కమిటీ నిర్ణయం మేరకు రూ.50 వేల చొప్పున నగదు పురస్కారం అందచేయడం జరుగుతుందని నార్ల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా ఈ నిర్ణయం తీసుకొన్నట్టు తెలిపారు. కామ్రేడ్ జీజర్ పోలవరపు సాహితీదీకం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ, పాత్రికేయ పురస్కారాల కమిటీ ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. నార్ల వెంకటేశ్వరరావు గురించి మాట్లాడుతూ, నార్ల స్ఫూర్తివంతమైన జీవితం గడిపారన్నారు. ఆయన పాత్రికేయ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ గుమ్మా సాంబశివరావు, బండ్ల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వినూత్నంగా నాకూ సాధ్యమే

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 'నాకూ సాధ్యమే' కార్యక్రమం చేపడుతున్నట్టు డీఈవో పీవీజే రామారావు తెలిపారు. కలెక్టరు డీకే బాలాజీ ఆధ్వర్యంలో 65 మంది ప్రముఖుల విజయగాథలను పాఠశాలలకు పీడీఎఫ్‌లో పంపుతున్నామన్నారు. ఆంగ్లభాషలోని విజయగాథలను ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్లు జె.నాగేశ్వరరావు, పి.రామసీతాకుమారి, టి.శ్రీనివాస్, బి.వి.పి. శ్రీలలిత, బి.సరళకుమారి, బి.సురేష్‌కుమార్, జిల్లా సైన్స్ ఆఫీసర్ మహమ్మద్ జాకీర్‌హుస్సేన్‌లు అనువదించారన్నారు. ఈ విజయగాథలను సంక్షిప్తంగా ప్రతి పాఠశాలకు అందించామన్నారు. విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు ఉదయం పూట జరిగే ప్రార్థనా సమావేశంలో సంక్షిప్తంగా ఈ విజయగాథలను ఉపాధ్యాయులు చెప్పాలన్నారు. 'నాకూ సాధ్యమే' పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని డీఈవో సూచించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం కల్పించేందుకు, ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ఈ విజయగాథలు దోహదపడతాయన్నారు.

ఇన్‌చార్జి డీపీఆర్వోగా రాజేష్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో డివిజనల్ పీఆర్వోగా పనిచేస్తున్న రాజేష్‌ను ఇన్‌ఛార్జి డీపీఆర్వోగా నియమించారు. డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర ప్రసాద్ సెలవుపై మూడునెలల పాటు అమెరికా వెళుతున్నారు. మరో రెండు నెలల్లో డివిజనల్ పీఆర్వో శ్రీనివాస్ రిటైర్ కానున్నారు. ఈ నేపథ్యంలో రాజేష్‌ను ఇన్‌ఛార్జి జిల్లా పౌర సంబంధాల శాఖాధికారిగా నియమించారు.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్ రెడ్డి దంపతులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

వన్‌టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో కేఎస్ రామారావు, అర్చకస్వాములు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వారికి వేదపండితులు ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

దేవస్థానం ఆస్థాన సిద్ధాంతిగా చల్లా శ్రీనివాస శర్మ

దుర్గామల్లేశ్వర దేవస్థానానికి ఆస్థాన సిద్ధాంతిగా బాధ్యతలు స్వీకరించిన చల్లా శ్రీనివాస శర్మను ఆదివారం కళావేదికపై ఈవో పరిచయం చేశారు. ఆలయ స్థానాచార్యుడు, ముఖ్య అర్చకులు, అర్చకులు, వేద పండితులు, తదితరులు శ్రీనివాస శర్మను పరిచయం చేసుకున్నారు. 1965లో పల్నాడు జిల్లా, రాజుపాలెం మండలం, నెమలిపురి గ్రామంలో శ్రీనివాస శర్మ జన్మించారు. ఆయన తండ్రి సూర్యనారాయణరావు, తల్లి రాజ్యలక్ష్మి. ఆయనకు ప్రథమ గురువు తండ్రి. స్మార్త విద్యను మూర్తి వెంకటరామ శర్మ వద్ద అభ్యసించారు. ఈయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. శర్మకు జ్యోతిష్య మార్తాండ, జ్యోతిష్య విశారద, జ్యోతిష్య వాచస్పతి, అంతర్జాతీయ జ్యోతిష్య మహర్షి, దైవజ్ఞరత్న వంటి పలు బిరుదులు ఉన్నాయి. అఖిల భారత బ్రాహ్మణ సంఘం ఆయనకు జ్యోతిష్య విద్వత్‌మణి బిరుదు ఇచ్చింది.



చల్లా శ్రీనివాస శర్మకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

ముగిసిన నాణెం!

» చివరి రోజున భారీగా యువత » ప్రదర్శనను తిలకించిన కలెక్టర్ లక్ష్మీశ దంపతులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్)

అమెరికా డాలర్.. అర్జంటైనా పెసో.. ఆస్ట్రియా యూరో.. బ్రెజిల్ రియల్.. చైనా రెన్‌మిన్బీ.. ఇవన్నీ ఆయా దేశాల కరెన్సీ నోట్లు. దేశంలో శాతకర్ణులు పాలన సాగినప్పుడు చలామణి అయిన కరెన్సీ మాసా. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసి చరిత్రలో నిలిచిపోయిన నాణేలు ఐదు పైసలు, పది పైసలు, పావలా, అర్ధరూపాయి. ఇలా ఆసక్తి ఉన్న నాణేన్ని, కరెన్సీ నోటును యువత కొనుగోలు చేశారు. విజయవాడలో మూడురోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ కాయిన్స్ ఎక్స్‌పో ఆదివారం ముగిసింది. ఈ ప్రదర్శనను జిల్లా కలెక్టర్ లక్ష్మీశ దంపతులు, గుంటూరు మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు, సీఐడీ ఎస్పీ కడియం చక్రవర్తి, తానా మాజీ అధ్యక్షుడు నిరంజన్ సందర్శించారు. యువత, విద్యార్థులు భారీగా తరలివచ్చారు. కరెన్సీ నోట్లను ఆసక్తిగా కొనుగోలు చేశారు.



పైథాన్‌లకు ప్రత్యేకం

జీవ వైవిధ్యం, జలవనరుల సంరక్షణ కోసం వివిధ దేశాలు అనేక రూపాల్లో నాణేలను ముద్రించాయి. ద్వీపాల సమూహంతో ఉండే నియూ దేశం మాత్రం దట్టమైన అడవుల్లో ఉండే కోబ్రాలు, విషపు పైథాన్‌లతో ప్రత్యేక నాణేలను ముద్రించింది. లోన్‌సమ్ జార్జి అనే పాము ముఖ చిత్రంతో 2015లో త్రీడీ ప్రింటింగ్ కాయిన్‌ను తీసుకొచ్చింది. ఆ తర్వాత సంవత్సరం 2016లో గ్రీన్ ట్రీ పైథాన్ పేరుతో వెండి త్రీడీ నాణేన్ని ముద్రించింది. 700 చొప్పున ఒక్కో నాణేన్ని ముద్రించింది. ఈ రెండు నాణేలను రెండు డాలర్ల విలువతో ముద్రించింది.

'ఈగ' నాణెం

ఈగ.. నిత్యం ఇళ్లలో కనిపించే కీటకం. ఈ పేరు ఏకంగా తెలుగు చిత్రం తెరకెక్కింది. ఇప్పుడు ఈగకు ఒక ప్రత్యేక నాణెం వచ్చింది. నియూ దేశం ఈగ చిత్రంతో వెండి నాణేన్ని 2014లో ముద్రించింది. రెండు డాలర్ల విలువతో 700 నాణేలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇది పూర్తిగా డిజిటల్ ప్రింటింగ్ కాయిన్.





కోస్ట్ గార్డు స్టాంప్స్

1977 ఫిబ్రవరి ఒకటో తేదీన నడి సముద్రంలో గూఢచార్య చర్యలను అడ్డుకోవడానికి, సముద్ర స్మగ్లర్లకు చెక్ పెట్టడానికి ఇండియన్ కోస్ట్‌గార్డు పురుడు పోసుకుంది. భారతదేశంలో సముద్ర జలభాగానికి ఇది లా ఎన్‌ఫోర్స్‌మెంట్. మొదట్లో చిన్నగా ఉన్న ఈ సీజీ (కోస్ట్‌గార్డు) ఇప్పుడు దేశంలోని సముద్ర ప్రాంతమంతా విస్తరించింది. దీని గౌరవార్థం కేంద్ర ప్రభుత్వం 2008 ఆగస్టు 12వ తేదీన రూ.5ల స్టాంపును విడుదల చేసింది. ఈవిధంగా రెండు తపాల స్టాంపులను ముద్రించింది. ఒక దానిపై హెలికాప్టర్, మరో స్టాంపుపై కోస్ట్‌గార్డు ఓడ చిత్రాలను ముద్రించింది.



లైట్‌హౌస్‌లకు ఒక స్టాంప్

ఒక దేశం తీరం నుంచి మరో దేశానికి సరుకులతో బయలు దేరిన ఓడ గమ్యస్థానానికి చేరుకుందని తెలిపే సంకేతం లైట్‌హౌస్. నౌకాశ్రయాలకు సమీపంలో ఈ లైట్‌హౌస్‌లను నిర్మిస్తారు. రాత్రి సమయాల్లో ప్రయాణించే నౌకలకు తీరం సమీపంలో ఉందని అందులో ఉన్న కెప్టెన్‌కు తెలియజేయడానికి లైట్‌హౌస్ నుంచి ఒక లైట్ చుట్టూ తిరుగుతుంది. ఈ లైట్‌హౌస్‌లకు అమెరికా ఒక స్టాంప్‌ను కేటాయించింది. లైట్‌హౌస్ చిత్రాలతో ఒక్కో స్టాంపును ఇంగ్లండ్ ముద్రించింది.

అంతరిక్ష ఆనవాళ్లు

అంతరిక్ష ప్రయోగాలను ఆదిలోనే అందిపుచ్చుకున్న దేశం అమెరికా. అంతరిక్షంలో వ్యోమగాములు పంపిన దేశం. ప్రపంచంలో అంతరిక్ష ప్రయోగాల్లో అమెరికాది పైచేయి ఉంటుంది. అంతరిక్షంపై చేసిన పరిశోధనలకు సంబంధించి అమెరికా ప్రత్యేక పోస్టల్ స్టాంపును తీసుకొచ్చింది. స్పేస్ డిస్కవరీ పేరుతో ఈ స్టాంపులన ముద్రించింది.





కలెక్టర్ లక్ష్మీశను సన్మానిస్తున్న పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు

వ్యాయామంతో మంచి క్రమశిక్షణ

» పోలీస్ స్పోర్ట్స్ ముగింపు సభలో కలెక్టర్ లక్ష్మీశ

గుణదల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మనిషి దైనందిన జీవితంలో ఏదైనా వ్యాయామం చేస్తే మంచి క్రమశిక్షణ అలవడుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. నవంబరు 28వ తేదీ నుంచి 30 వరకు మూడు రోజులు నిర్వహించిన పోలీస్ స్పోర్ట్స్ మీట్-2024 ముగింపు కార్యక్రమం సిటి ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ విచ్చేసి విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మనిషి దైనందిన జీవితంలో ఏదైనా వ్యాయామం అలవర్చుకోవాలని చెప్పారు. తద్వారా శారీరకంగా, మానసికంగా ఉత్సాహంగా ఉంటారన్నారు. సీపీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ, సిబ్బందిలో ఉత్సాహం పోటీతత్వం పెంపొందించడానికి యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ దోహదపడుతుందని చెప్పారు. రానున్నకాలంలో పోలీస్ వెల్ఫేర్‌పై దృష్టి సారించి సిబ్బందికి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఆర్. ఏసీపీ డి.ప్రసాదరావు, డీసీపీలు గౌతమి షాలి, తిరుమలేశ్వర రెడ్డి, కృష్ణమూర్తి, ఎస్.వి.డి ప్రసాద్, జి.ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బుడమేరు వరద అర్జీలపై బాధ్యతా రాహిత్యం

» తహసీల్దార్‌పై చర్యలకు కలెక్టర్ ఆదేశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బుడమేరు వరద సహాయపు అర్జీల విచారణలో బాధ్యతా రాహిత్యం ప్రదర్శించినందుకు విజయవాడ నార్త్ తహసీల్దార్ ఎం.సూర్యారావుపై శాఖపరమైన చర్యలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ఆదివారం ఆదేశించారు. బుడమేరు వరదల కారణంగా తాము ముంపునకు గురయ్యామని, ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని విజయవాడ నార్త్ మండలానికి చెందిన 500 మంది ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలను సమర్పించారు. దరఖాస్తు చేసుకున్న అర్జీదారులంతా పరిహారానికి ప్రాథమికంగా అర్హులేనని వారికి తహసీల్దార్ ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. వీటికి సంబంధించి విజయవాడ ఆర్డీవో విచారణలో కొందరు మాత్రమే అర్హులని నిర్ధారణ జరిగింది. అర్హుల నిర్ధారణ విషయంలో సందిగ్ధ పరిస్థితులకు కారణమైన తహసీల్దార్ సూర్యారావుపై శాఖాపరమైనచర్యలకు కలెక్టర్ ఆదేశించారు.

బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రణాళికలు

» మంత్రి కొలుసు పార్థసారథి



మాట్లాడుతున్న మంత్రి సారథి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్-2047లో బలహీనవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారని మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. మచిలీపట్నం యాదవ సంఘాల ఆధ్వర్యంలో లలిత కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన సమావేశంలో సారథి మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతికుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విజన్-2047 డ్యాకుమెంట్‌ను రూపొందిస్తున్నట్టు సీఎం చెప్పారన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. మంత్రి రవీంద్ర సహకారంతో యాదవ కుటుంబాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. యాదవులు దళితులకు అండగా నిలవాలని, అప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రొండి కృష్ణయాదవ్ మాట్లాడుతూ, సబ్సిడీపై పశువులకు బీమా పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. వీర్ల శ్రీరామ్ మాట్లాడుతూ, మచిలీపట్నంలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాన్ని యాదవులకు కేటాయించాలన్నారు. పల్లపాటి వెంకట్రావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, బచ్చుల అనిల్, గొరిపర్తి రాము, నాంచారయ్య సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి సారథికి భగవద్గీత గ్రంథాన్ని ఇచ్చి సత్కరించారు.



మృతులు చీలి ఏసుబాబు, తల్లి సుధారాణి, భానుప్రకాష్, చింతా రవి, నివాళులర్పిస్తున్న జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ

స్నేహితుల మృతితో ఊరంతా విషాదం..

» తరలివచ్చిన బందరు ప్రజలు

» నివాళులర్పించిన నేతలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు రోడ్డు ప్రమాదంలో మృతులకు ఆదివారం ఉయ్యూరు ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మచిలీపట్నం తరలించారు. దీంతో బలరామునిపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. స్థానిక ప్రజలతో పాటు స్నేహితులు, కలిసిపనిచేసే కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. యువకుల మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొడుకు మృతితో ఆగిన తల్లి గుండె..

చీలి ఏసుబాబు (ప్రభు) మృతదేహం పక్కనే అతని తల్లి సుధారాణి మృతదేహాన్ని ఉంచారు. కుమారుడు మృతి వార్త విన్న ఆ తల్లి గుండె ఆగి చనిపోయిన సంగతి తెలిసిందే. తల్లీకొడుకుల మృతితో బంధువుల రోదన ఇంతా అంతా కాదు. ఏసుబాబుకు ఇటీవలే పెళ్లి సంబంధాలు చూస్తున్నారు.

భర్తను కోల్పోయి.. దుఃఖంలో గర్భిణి

మృతుడు చీలి భాను ప్రకాష్ (చింటు)కు భార్య అమల, ఒక కుమార్తె. కాగా ఆమె గర్భవతి. భర్త మృతితో ఆమెను ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు.

మందులకోసం వెళ్లిన కొడుకు మృతితో విలవిల్లాడిన తండ్రి హృదయం..

తండ్రికి మందులు తెచ్చేందుకు చింతా రవి(బాబి) స్నేహితులతో కలిసి విజయవాడ వెళ్లాడు. మందులు తేవడానికి వెళ్లిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తండ్రి హృదయం విలవిల్లాడింది. నడవలేని స్థితిలోనూ కుమారుడి అంత్యక్రియలను నిర్వహించాల్సిన పరిస్థితి.



మృతులకు జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎండీ ఇలియాస్ బాషా, చిట్టూరి యువరాజ్, బండారు నాని, ఊకంటి రాంబాబు, రాజులపాటి నాగబాబు, కోళ్లపల్లి గణేష్, పేర్ని కిట్టు తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

అటో.. ఇటో.. ఎటో!

(5వ పేజీ తరువాయి)

జిల్లాల కలెక్టర్లు జాబితాలు లేదా నివేదికలు తయారుచేసి కౌంటర్ సంతకంపెట్టి కృష్ణా కలెక్టర్‌కు పంపాల్సి ఉంది. వీటిని పరిశీలించి కృష్ణా కలెక్టర్ సంతకాలు చేస్తేనే పరిపాలనా ఆమోదం లభిస్తుంది. అలాగే, గతంలో ప్రతి శాఖకూ జిల్లాస్థాయి అధికారులు ఉండేవారు. అనుభవం ఉన్నవారు, వారి పనితీరు, సత్వర నిర్ణయాలు వేగంగా జరిగేవి. ప్రస్తుతం వివిధ శాఖల్లో డివిజన్‌స్థాయి అధికారులే జిల్లా స్థాయి ఇన్‌చార్జులుగా పనిచేస్తున్నారు. ఉదాహరణకు ఆర్ డబ్ల్యూఎస్ విభాగంలో గతంలో ఎస్ఈ స్థాయిలో అధికారి ఉండేవారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని డివిజన్ల డీఈలు, ఈఈలు ఆయన పరిధిలో పనిచేసేవారు. గతంలో గుడివాడలో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయాన్ని ఇటీవలే మచిలీపట్నానికి మార్చారు. డీఈస్థాయి అధికారిని ఈఈగా నియమించారు. ఎన్టీఆర్ జిల్లాకు వేరే ఎస్ఈ ఉండటంతో మచిలీపట్నంలోని డీఈస్థాయి అధికారి ఈఈగానూ, ఎస్ఈగానూ పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. డీఈ స్థాయిలో ఉన్న అధికారి ఇతర డివిజన్లలో ఉన్న డీఈలకు పరిపాలనాపరమైన ఆదేశాలు జారీచేస్తుంటే, వారు పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. కృష్ణా పంచాయతీ అధికారి (డీపీవో) పోస్టు కృష్ణాజిల్లాలో అధికారికంగా ఉండగా, ఎన్టీఆర్ జిల్లా డీపీవో పోస్టును మార్చేశారు. దీంతో ప్రజలు తికమకకు గురవుతున్నారు. డ్వామా పీడీ, సంక్షేమ శాఖ అధికారుల పోస్టులదీ ఇదే తీరు.

ఈ రెండు నియోజకవర్గాల్లో అయోమయం

నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఏలూరు జిల్లాలో కలిపారు. జిల్లా పరిషత్ ఉమ్మడిగానే కొనసాగుతుండటంతో ఈ రెండు నియోజకవర్గాల్లోని శాసనసభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీ సమావేశాలు జరిగే సమయంలో మచిలీపట్నానికి వస్తున్నారు. తమ నియోజకవర్గాల్లోని సమస్యలను చెబితే 'చూద్దాం.. చేద్దాం.' అనే ధోరణితో అధికారులు వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన జెడ్పీ సమావేశానికి ఎన్టీఆర్ జిల్లాకు చెందిన శాసనసభ్యులు, ఎంపీ హాజరుకాలేదు. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలకు చెందిన శాసనసభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు గత జెడ్పీ సమావేశాలకు హాజరై, ఇక నుంచి తాము పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీ సమావేశాలకు వెళ్తామని చెప్పడం గమనార్హం. కాగా, నూజివీడు నియోజకవర్గాన్ని కృష్ణాజిల్లాలో కలుపుతామని ఎన్నికల ముందు టీడీపీ అధినేత ఇక్కడి ప్రజలకు హామీ కూడా ఇచ్చారు.

పెనమలూరు, గన్నవరానికి దూరాభారం

జిల్లాల పునర్విభజనకు సంబంధించి మొత్తం 2,885 అభ్యంతరాలు వచ్చాయి. జిల్లాల భౌగోళిక మార్పులు, చేర్పులకు సంబంధించి పెనమలూరు, గన్నవరం, నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల ప్రజలు, రాజకీయ పక్షాల ఐక్యవేదికల నేతృత్వంలో పెద్ద ఎత్తున అభ్యంతరాలు అందజేశారు. పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని, నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను కృష్ణాజిల్లాలో కలపాలన్నదే ప్రధాన డిమాండ్. పెనమలూరు, గన్నవరం మండలాల్లోని గ్రేటర్ గ్రామాలు రాజధాని అమరావతి ప్రాంత పరిధిలోనివి. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం, కేసరపల్లిలో ఏస్ అర్బన్-ఏపీఐఐసీ హైటెక్ సిటీ, హెచ్‌సీఎల్ వంటి కంపెనీలు, కొండపావులూరులో ఎన్‌డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం, సీపెట్ వంటి కేంద్ర సంస్థలు, వీరపనేనిగూడెం, మల్లవల్లిలో ఇండస్ట్రియల్ పార్క్, మెగా ఫుడ్‌పార్క్‌లు గన్నవరంలో ఉన్నాయి. పునర్విభజన వల్ల ఇవన్నీ కృష్ణాజిల్లాలోకి వెళ్లిపోయాయి. ఇక పెనమలూరు నియోజకవర్గం విజయవాడకు పక్కనే ఉంటుంది. అయినా 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న బందరుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వణికిస్తున్న వాన

(5వ పేజీ తరువాయి)

కొనుగోలును నిలిపివేశారు.

లక్ష టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలో ఇప్పటివరకు 26 వేల హెక్టార్లలో వరికోతలు పూర్తిచేశారు. ఇందులో యంత్రాల ద్వారా కోసిన ధాన్యమే అధికం. మూడు, నాలుగు రోజులుగా వర్షం హెచ్చరికలతో రైతులు ధాన్యాన్ని రహదారులపైకి చేర్చారు. జిల్లాలో డ్రయ్యర్ సౌకర్యం ఉన్న 70 మిల్లులకు, ఇతర మిల్లులకు 97 వేల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ద్వారా పంపారు. ఇతర జిల్లాల్లోని మిల్లులకు 3 వేల టన్నుల ధాన్యాన్ని పంపామన్నది అధికారుల లెక్క.

రాశులుగానే ధాన్యం

జిల్లాలోని అన్ని మండలాల్లో రహదారులపై ధాన్యాన్ని రాశులుగా పోశారు. కొంతమేర సంచుల్లోకి ఎత్తి గుట్టలుగా వేయగా, అదంతా వర్షంలోనే ఉండిపోయింది. పామర్రు, కనుమూరు, అడ్డాడ, పెదమద్దాలి గ్రామాల్లోని 150 టార్పాలిన్లను మాత్రమే రైతులకు అందజేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. పామర్రు, కురుమద్దాలి, జుజ్జువరం తదితర ప్రాంతాల్లో మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై ధాన్యపు రాశులను పరదాలతో కప్పి ఉంచారు.

నేలవాలిన వరి

వరిపైరు కోతకు సిద్ధమైన దశలో మొదళ్లు బలహీనపడతాయి. వర్షం కారణంగా పైరు, కుంకులు తడిచి బరువెక్కితే పైరు నేలవాలుతుంది. బలమైన ఈదురుగాలులు వీస్తే మరింతగా కుంగుతుంది. బంటుమిల్లి మండలంలో ఆదివారం అత్యధిక వర్షపాతం నమోదైంది. బలమైన గాలులకు తోడు వర్షం కురవడంతో మండలంలోని సాతులూరు, కంచడం, బర్రిపాడు తదితర గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలవాలింది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. తుంపర్లతో కూడిన వర్షం కురవడంతో ధాన్యం అధిక సమయం పాటు తడిచి రంగు మారుతుందనే భయం రైతులను వెంటాడుతోంది. అర్తమూరు, మల్లేశ్వరం, పెందుర్రు తదితర గ్రామాల్లో రహదారులపైనే ధాన్యపు రాశులను పరదాలతో కప్పి ఉంచారు. చల్లపల్లి, మండలంలోని పురిటిగడ్డ, లక్ష్మీపురం, పాగోలు, చల్లపల్లి తదితర గ్రామాల్లో వరిపొలాలు నేలవాలాయి. మోపిదేవి మండలంలో ఆదివారం సాయంత్రం నుంచి వర్షం అధికంగా కురిసింది. పెదప్రోలు, వెంకటాపురం గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల నుంచి సంచులు ఇవ్వకపోవడంతో రైతులు ధాన్యాన్ని విక్రయించుకునే అవకాశమే లేకుండాపోయింది. రైతుసేవా కేంద్రాల వద్ద తీసిన తేమశాతానికి, మిల్లుల వద్ద చూసే తేమశాతానికి మధ్య తేడా ఉండటంతో రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రైతుసేవా కేంద్రాల వద్ద ధాన్యంలో నమోదుచేసిన తేమశాతమే పరిగణనలోకి తీసుకుని ధర నిర్ణయిస్తామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అది అమలు కావడంలేదు. మధ్యవర్తులు నిర్ణయించిన తేమశాతం, మద్దతు ధరే అమలవుతోంది.



మోపిదేవి మండలం కప్తానుపాలెం వద్ద రహదారిపై ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

జిల్లాలో వర్షపాతం ఇలా..

జిల్లావ్యాప్తంగా ఆదివారం ఉదయం 8.30 గంటలకు బంటుమిల్లిలో అత్యధికంగా 30.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా నందివాడలో 1.6 మిల్లీమీటర్లు నమోదైంది. సగటు వర్షపాతం 8.8 మిల్లీమీటర్లుగా ఉంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	105,113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 620

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో టీడీపీ నాయకులు

పెనమలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు ఎన్టీఆర్ గార్డెన్స్ వద్ద ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పాత కార్డులు ఉన్నవారికి రెన్యువల్ చేస్తూ కొత్త వారికి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం మొత్తం వంద మందికి కొత్త సభ్యత్వాలు ఇచ్చినట్లు టీడీపీ నాయకులు మొక్కపాటి శ్రీనివాస్ తెలిపారు. టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు వెలగపూడి శంకరబాబు, శొంఠి శివరాం ప్రసాద్, బలగం కొండ పాల్గొన్నారు.







ఉయ్యూరులో నేలవాలిన వరి పంట.. కడవకొల్లులో ధాన్యం సంచుల్లోకి ఎత్తుతున్న కార్మికులు.. పురుషోత్తపట్నంలో ధాన్యంపై పరదాలు కప్పుతున్న రైతులు

వదలని వర్షం.. నేలకొరిగిన పంట

- తుఫానుతో వణుకుతున్న రైతులు
- ధాన్యం ఆరబెట్టే అవకాశం లేక తెగ నమ్ముకుంటున్న రైతులు

ఉయ్యూరు / గన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొస్తున్న తరుణంలో ప్రకృతి వైపరీత్యం తుఫాను రూపంలో దాడి చేయడంతో రైతులు కోలుకోలేని పరిస్థితుల్లోకి నెట్టబడుతున్నారు. పంట కోత తరుణం మించిపోతున్న నేపథ్యంలో తుఫాను హెచ్చరికలతో ఏవిధంగా నైనా నష్టపోవాలసిన పరిస్థితి ఏర్పడుతుందన్న భావనతో కోతకోయించి ధాన్యం రోడ్ల పైన ఆరబెట్టారు. దీంతో వాతావరణం మార్పుతో వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం రాశులుచేసి పట్టాలు కప్పి ఉంచారు. దీంతో ఎక్కువ రోజులు ఆవిధంగా ఉంచడం వల్ల ధాన్యం రంగుమారి ఎక్కువగా నష్టపోవలసి వుస్తుందని, బస్తాకు రూ. 4వందల నష్టానికి సైతం దళారులు, మిల్లర్లకు తెగనమ్ముకుంటున్నారు. ఇదిలా ఉండగా కోతకో యకుండా ఉంచిన పొలంలో గాలులు, వర్షానికి నేల వాలి నష్టం వాటిల్ల చేయగా మనుషులతో కోయించి పొలంలో పనలమీద ఉంచిన తరుణంలో కురుస్తున్న వర్షం వల్ల నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బస్తాకు రూ. 400 నష్టం



కోతకోయించి మూడు రోజులుగా ధాన్యం రాశి రోడ్డుపక్కన పట్టాలు కప్పి ఉంచాము. తుఫాను ప్రభావం మరికొన్ని రోజులు ఉంటుందన్న హెచ్చరికలతో ధాన్యం అలా ఉంచితే తేమకు రంగు మారి ఎక్కువ నష్టం కలుగుతుందని, బస్తా రూ.1350 కు అమ్మాను. ప్రభుత్వ ధర రూ.1740 కు అమ్మాను. బస్తాకు రూ.400 నష్టం.

- సీతారామయ్య, రైతు కడవకొల్లు

రోడ్లపైనే ధాన్యం రాశులు

గన్నవరం : ఫెంగల్ తుఫాను రైతులను వెంటాడుతుంది. గత నాలుగు రోజులుగా కంటి మీద కునుకులేకుండా చేస్తుంది. వాతావరణంలో మార్పులు మరింత భయాందోళనకు గురి చేస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పంటను కోసి విక్రయించేందుకు రోడ్లపై ఆరబోసారు. ఈలోపు ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో వర్షం జల్లులు పడుతున్నాయి. ధాన్యంపై పరదాలు కప్పుకొనే పనిలో రైతంగా ఉంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఫెంగల్ పాలవుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. అక్కడక్కడ కొయ్యని పంట పొలాలు నేలవాలాయి. తుఫాన్ ఎప్పుడు పోతుందోనని రైతాంగం ఎదురు చూస్తుంది.

యార్డులో ధాన్యం నిల్వ చేసుకోవచ్చు : తహసీల్దార్ సురేశ్

ఉయ్యూరు : తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న పరిస్థితుల్లో కోతకోసి రోడ్లపై రాశులుపోసి, సంచుల్లోకి ఎత్తి ఆరుబయట లాటులు వేసిన ధాన్యం తడవకుండా రైతులు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణ గోదాముల్లో నిల్వ ఉంచి భద్రపరుచుకోవచ్చని మండల తహసీల్దార్ ఎం. సురేశ్‌కుమార్ అన్నారు. ధాన్యం మిల్లులకు తోలే అవకాశం లేక గోదాములో ఉచితంగా నిల్వ చేసుకునేందుకు రైతులకు అవకాశం కల్పించాల్సిందిగా ఆదివారం కొందరు రైతులు కోరడంతో ఆయన అంగీకరించారు. దీంతో లారీలతో ధాన్యం తీసుకువచ్చి రైతులు దాచుకున్నారు. ఈ సందర్భంగా యార్డు ఆవరణలో గోదాముల కెపాసిటీ, దిగుమతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాటూరు, గండిగుంట, పెదఓగిరాల తదితర గ్రామాల నుంచి 15 మంది రైతులు 2,500 బస్తాల ధాన్యం లారీలు, ట్రాక్టర్లతో తీసుకువచ్చి దిగుమతి చేసుకుని గోదాములో భద్రపరుచుకున్నారని తహసీల్దార్ తెలిపారు.



ఉయ్యూరు ఏఎంసీ గోదాములో ధాన్యం నిల్వ చేసుకుంటున్న రైతులు.. పరిశీలిస్తున్న తహసీల్దార్



పోరంకి టీడీపీ కార్యాలయంలో మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

వైద్యశిబిరానికి విశేష స్పందన

పెనమలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పోరంకి టీడీపీ కార్యాలయంలో ఆదివారం అనుమోలు ఆదరణ ట్రస్టు..క్యాపిటల్ ఆసుపత్రి వారి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆసుపత్రి వైద్యులు షుగరు, బీపీ పరిక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ట్రస్టు అధ్యక్షులు అనుమోలు ప్రభాకరరావు, బొంగరాల అబ్రహాం, కే రాధ, అన్వర్, కోలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యనమలకుదురు ఎన్టీఆర్ గార్డెన్స్ వద్ద..

కామినేని ఆసుపత్రి, యనమలకుదురు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో యనమలకుదురు ఎన్టీఆర్ గార్డెన్స్ వద్ద ఆదివారం జరిగిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. సుమారు వందమంది స్థానికులకు ఉచితంగా షుగరు, బీపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, మొక్కపాటి శ్రీనివాస్, శొంఠి శివరాంప్రసాద్, కొండ, ఉమామహేశ్వరరావు, షణ్ముఖరావు, డాక్టర్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



యనమలకుదురులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఐదోరోజుకు చేరిన భవన కార్మికుల దీక్షలు

గన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గన్నవరం అయోధ్య అపార్టుమెంట్స్ బాధిత కార్మికులకు న్యాయం చేయాలంటూ చేస్తున్న రిలే దీక్షలు ఆదివారానికి 5వ రోజుకు చేరాయి. అపార్టుమెంట్స్ ఎదురుగా రోడ్డుపై షామియానా వేసి అక్కడే వంటావార్పు చేసుకున్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు నాగ బ్రహ్మాచారి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఐక్యంగా ఉంటేనే న్యాయం జరుగుతుందన్నారు. రామ్మోహనరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



వనసమారాధనకు హాజరైన బ్రాహ్మణ పరిషత్ కుటుంబ సభ్యులు

సందడిగా బ్రాహ్మణ పరిషత్
కార్తీక వన సమారాధన

గన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భక్తాంజనేయ స్వామి దేవాలయం సమీపంలోని సపోట తోటలో ఆదివారం బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన సం దడిగా జరిగింది. తొలుత ఉసిరి చెట్టుకు పూజలు చేసి అభిషేకాలు జరిపారు. రాష్ట్ర బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్య క్షులు కొప్పరపు వెంకట బలరామకృష్ణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి కార్తీక వనసమారాధన విశిష్టతను వివరించారు. బ్రాహ్మణులంతా సమిష్టిగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు ఆటల, పాటల, క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాలు, భగవద్గీత నుంచి కొన్ని శ్లోకాలను పారాయణ పోటీలు నిర్వహించారు. ఆగిరిపల్లి వేద పాఠశాల విద్యార్థులు వేద పారాయణ చేశారు. చిన్నారులచే నృత్య ప్రదర్శన, సంగీత విభావరి అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు పన్యారం విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కప్పగంతు లక్ష్మణ్‌శాస్త్రీ, గోపరాజు సత్య పవన్‌కుమార్, తిమ్మ రాజు వెంకట సుబ్బారావు, మామిళ్లపల్లి సుబ్బారావు, చదలవాడ శివనాగేశ్వరరావు, వకుళ, సరస్వతుల వెంకట ఆదిత్య, స్వర్ణ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన శిబిరాలు

పటమట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(ఏపీ శాక్స్) ఆదేశాల మేరకు దిశ ఆధ్వర్యంలో పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో రెండు ప్రదేశాల్లో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి ఉషారాణి ఆధ్వర్యంలో హెచ్ఐవీపై ఐఈసీ క్యాంపెయిన్ నిర్వహించారు.

ఉపాధి హామీ జాబ్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డుల జారీకి వ్యవసాయ కూలీల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు బాపులపాడు మండల ఉపాధి పథకం ఏపీవో ఎస్.అశోక్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి పథకం ద్వారా లబ్ధిపొం దేందుకు జాబ్ కార్డు దోహదపడుతుందని కార్డు కావాలిసిన వారు గ్రామ సచివాలయం కార్యదర్శి, ఫీల్డు అసిస్టెంట్ ద్వారా ఉపాధి హామీ కార్యాలయంలో అందించాలని కోరారు. దరఖాస్తు తో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు లేదా పోస్టాఫీసు అకౌంట్ బుక్ జిరాక్సు కాపీలను జత పరిచి అందిస్తే వారికి వెంటనే కార్డులు జారీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

పునీత ఫ్రాన్సిస్ శౌరి
మహోత్సవాలు ప్రారంభం

గన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని అజ్జంపూడిలో పునీత ఫ్రాన్సిస్ శౌరివారి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నెల్లూరు మేత్రాసనం బిషప్ పిల్లి అంతోని దాస్ పతాక ఆవిష్కరణ చేసి సమిష్టి దివ్యబలిపూజ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసం గిస్తూ పునీత ఫ్రాన్సిస్ శౌరి ఆదర్శనీయులని చెప్పారు. ఆయన బాటలో అందరు నడిచి ఏసుక్రీస్తును ఘనపరచాలన్నారు. గోవా నుంచి తన సువార్తను ప్రారంభించి అన్ని ప్రాంతాలకు విస్తరించి క్రీస్తు విశిష్టతను సాటి చెప్పారన్నారు. ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించి పాపుల రక్షణకు కృషి చేశారని తెలిపారు. ఈదర విచారణ గాయక బృందం గీతాలాలపించగా, బాలబాలికల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఐఐఎంవీలో రాణించే వారికి ఉత్తమ అవార్డు

గన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎంవీ)లో ఫైనాన్స్ అండ్ అక్కౌంటింగ్ ఎంబీఏ విభాగంలో ఉత్తమ విద్యార్థి అవార్డును ప్రతి ఏటా ప్రదానం చేయడానికి నిధి సమకూరినట్లు వీకేఆర్ కళాశాల అధ్యక్షులు మొటపర్తి వెంకట్ ఆదివారం తెలిపారు. వి ద్యార్థినులను విద్యా, వ్యాపార రంగాల్లో ప్రోత్సహించడానికి ఉత్తమ అవార్డు ప్రదానం చేయటం జరుగుతుందన్నారు. కళాశాల యాజమాన్య కమిటీ మాజీ అధ్యక్షురాలు మొటపర్తి రామచంద్రమ్మ పేరిట అవా ర్డును ఇస్తామన్నారు. దీనికి రూ.5.25 లక్షలతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేశామని, ఈ మేరకు ఆ కళాశాలతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు.

అసత్య కథనాలపై ఫిర్యాదు.. కేసు నమోదు

ఉయ్యూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌పై అసత్యకథనాలు ప్రచారం చేశారన్న ఫిర్యాదు మేరకు న్యూస్ 360 యూట్యూబ్ చానల్‌పై ఉయ్యూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. సీఐ టీవీవీ రామారావు వివరాల ప్రకారం.. ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌పై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ అసత్య కథనాలు, కల్పితాలు న్యూస్ 360 యూ ట్యూబ్ చానల్‌లో ప్రచారం చేసారని పట్టణ టీడీపీ అధ్యక్షుడు జంపాన గుర్నాధరావు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న న్యూస్ 360 చానల్ నాలుగు ఐదు రోజులుగా బోడె ప్రసాద్‌కు ఎటువంటి సంబంధం లేని, అంశాలలో నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ఆయన పరువు, వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగిస్తూ వివిధ వర్గాల, రాజకీయ పార్టీల మధ్య ఉద్రిక్తతలు పెంచే విధంగా కుట్రపూరితంగా అసత్య కథనాలు ప్రచారం చేస్తున్నారని గుర్నాధరావు చేసిన ఫిర్యాదు మేరకు ఆ చానల్ యాజమాని అట్లూరి ప్రవీణ్, శ్రీనివాస్, రాజమౌళి, కృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



సమ్మేళనంలో పాల్గొన్న జవహర్ నవోదయ పూర్వ విద్యార్థులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- జవహర్ నవోదయ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల్లో ఉద్యోగ, వ్యాపారాలతో పాటు వివిధ రంగాల్లో స్థిరపడిన జవహర్ నవో దయ విద్యాలయ, వేలేరు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా ఆదివారం నిర్వహించారు. వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయం ఆవరణలో (జెఎన్‌వీకెఏఏ).జవహర్ నవోదయ కృష్ణా, ఆల్ముని అసోసియేషన్ ఆధ్వర్యంలో 3వ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. అపూర్వ సమ్మేళనంలో మొదటి బ్యాచ్ నుంచి 29వ బ్యాచ్ వరకు చదివిన విద్యార్థులతో పాటు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులందరూ ప్రాగణమంతా కలియ తిరుగుతూ ఆనాటి తీపి గుర్తులను జ్ఞాపకం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. చదువులో ప్రథమ, ద్వితీయస్థానం సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహాలతో పాటు జ్ఞాపికను, స్కూల్ ఆల్‌రౌండర్ (ఆటలు, చదువుల్లో) ప్రతిభ చూపిన విద్యార్థికి జె.ఎన్.వీ.కృష్ణా ఆల్ముని అసోసియేషన్ తరపున బంగారుపతకం, ప్రశం సాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా దోనవల్లి రామారావు, వేములపల్లి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరావు, ఆల్ముని అసోసియేషన్ అధ్యక్షురాలు కోమలికుమారి, జనరల్ సెక్రటరీ డాక్టర్ సురేంద్రనాథ్, ఉపాధ్యక్షుడు పర్వతనేని బాలాజీ, కార్యదర్శి శ్రీప్రసేన్, తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీపై మినుము, పెసర విత్తనాలు

ఉంగుటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సార్వా వరి మాగాణుల్లో రెండో (రబీ) పంటగా వేసేందుకు 30శాతం రాయితీపై మినుము, పెసర(అపరాలు)విత్తనాలు రైతులకు అందుబాటులో వుంచినట్లు ఏవో హరీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మండలంలో దాళ్వా వరిసాగులేకపోవడంతో రెండోపంటగా రైతులు ఆరుతడి పంటలు వేయాలని ప్రభుత్వం సూచించిందని, ఈ నేపథ్యంలో రైతులకు పంపిణీ చేసేందుకు మినుములు 20 క్వింటాళ్లు, పెసలు 10 క్వింటాళ్లు స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సిద్ధంగా వుంచామని, అపరాల విత్తనాలు కావాల్సిన రైతులు తమ ఆధార్‌కార్డు, పొలం పాస్‌బుక్ జిరాక్స్ తీసుకుని సమీపంలోని వీఏఏలను సంప్రదించాలని ఏవో సూచించారు.

మహాకాళేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కృష్ణలంక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): త్రిశక్తిపీఠంలోని కాళీమాత ఆలయంలో మహాకాళేశ్వరుడిని ఆదివారం కార్తీక మాసం అమావాస్య సందర్భంగా ప్రత్యేకమైన సుగంధ ద్రవ్యాలతో అలంకరించి, పూజలు చేశారు. 150 మంది దంపతులతో చండీ హోమం, దేవతాపూజ, విశేషంగా అర్చన జరిపారు.

పారిశుధ్య కార్మికుల అగచాట్లు!

- ఐదు నెలలుగా అందని జీతాలు
- అధిక వడ్డీలతో కుటుంబ పోషణ
- జీతాలివ్వండి మహాప్రభో అని వేడుకోలు
- స్పందించని ఉయ్యూరు నగర పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఉయ్యూరు నగర పంచాయతీలో 5నెలలుగా జీతాలు లేక కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. నగర పంచాయతీలో దినసరి వేతనంతో కాంట్రాక్టు పద్ధతిన పారిశుధ్య పనులు చేస్తున్న 25 మంది కార్మికులకు జీతాలు రాకపోవడంతో పూటగడవని పరిస్థితుల్లో అధిక వడ్డీకి అప్పులు తెచ్చి అగచాట్లు పడుతూ జీతాలివ్వండి మహాప్రభో అని అధికారులను, ప్రజా ప్రతినిధులను వేడుకుంటున్నారు. నెలకు రూ. 12వేల వేతనంతో పారిశుధ్య పనులు చేస్తూ కుటుంబ పోషణ చేస్తున్న మాకు చాలీచాలని వేతనంతో నెలల తరబడి ఎలా బతకాలని ఆవేదన చెందుతున్నారు.



ఉయ్యూరు నగర పంచాయతీ కార్యాలయం

సీఎఫ్ఎంఎస్ నుంచి రావాలి

కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల జీతాలు బిల్లులు చేసి సీఎఫ్ఎంఎస్‌కు పంపాము. అన్ని మున్సిపాలిటీల్లో ఇదే సమస్య ఉంది. త్వరలో సీఎఫ్ఎంఎస్ నుంచి బిల్లు పాస్ అయి వస్తుంది. రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారం అవతుందని కమిషనర్ పి. వెంకటేశ్వరరావు వివరణ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

EDUCATION

» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA, ✆ 99493 08940

AJB-225661

WANTED

» IP BILLING INCHARGE, DUTY DOCTORS, OT TECHNICIAN, NURSING STAFF (ANM, GNM, Bsc NURSING) SRI SANTHI HOSPITALS, SURYA RAO PET, VIJAYAWADA - 2, Cont : 9542941199

AJB-1879

» బ్యాంకు అనుబంధ సంస్థకు రిటైర్డ్, VRS, స్టేట్ మరియు సెంట్రల్ ఎంప్లాయిస్, టీచర్స్, రియల్ ఎస్టేట్ వారు కావలెను. వ : 35-70, Q: 10th, జీ : 12-15వేలు, సంప్ర: 6304181391.

AJG-9629

★ Need Principal for a Junior & Degree College and Coaching Institute - with Good Communication Skills and Experience - Good Salary - Contact : 8714456669

AJH-723

TO-LET

» కృష్ణలంక SBI రోడ్‌లో అన్ని సౌకర్యాలతో A/C రూములు, గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఆఫీసులకు గోడౌన్‌లకు. పూర్తి ఫర్నీచర్‌తో ఫ్యామిలీ పోర్షన్ అద్దె కొరకు. సంప్ర: 83099 04493

AJB -676

TOURS & TRAVELS

★ మహాదేవ టూర్స్ : కాశీ యాత్ర 17/2, 2/3, ముక్తినాథ్ 14/3, ఛార్ ధాం 4/5 @ సంప్రదించండి : 9676637578

AJH-1386

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిములతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, దీని వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం

GST 5%

REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT

రూ॥290/-

కలర్ 30% EXTRA

1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777 మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733, గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240



ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు

✆ 99854 09240, 99854 11733, 99854 09286

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు

✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,

డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

సెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.620

లక్షా యాభై ఒక్కవేల దీపాలతో అర్చన

గుడ్లవల్లేరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీమత్ గంగాపార్వతీ సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం చివరిరోజు ఆదివారం రాత్రి లక్షాయాభై ఒక్కవేల దీపాలతో జోతిర్లిగం ఆకృతిలో దీపార్చన నిర్వహించారు. కట్టా నాగరాజు దంపతులచే ఈ దీపార్చన వేడుక నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ కొసరాజు వెంకటాద్రి (పెదబాబు), అన్నే ప్రసాదరావు, ఎ.వీరబద్రరావు, కొగంటి రాధాకృష్ణ, ఎం.కృష్ణ, గద్దే సోమ రాజు పాల్గొన్నారు.



తుఫానుకు వణుకుతున్న రైతులు



మంటాడ పరిధిలో ప్రైవేట్ వెంచర్ రోడ్డుపై ధాన్యం బస్తాల లాట్లు వర్షానికి తడవకుండా పట్టాలు కప్పిన రైతులు

పమిడిముక్కల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు వణికిపోతున్నారు. వరికోతలు ముమ్మరంగా సాగుతున్న ఈ తరుణంలో తుఫాను వర్షాలకు కోత కోసి పనలై ఉన్న వరి తడిసిపోతుండగా, మెషిన్‌తో కోతకోయించి ధాన్యం బస్తాలు మిలుల్లకు తరలించే అవకాశం లేక రోడ్లపై లాట్లు వేసి పట్టాలు కప్పి తడవకుండా రైతులు తంటాలు పడుతున్నారు. రెండురోజులుగా వీస్తున్న గాలులకు కొన్నిచోట్ల కోతకు వచ్చిన వరి నేలవాలి నష్టాన్ని కలగజేసింది. పొలాల్లో పనలపై ఉన్న వరి వర్షాలకు తడిసి పోతుండగా నీరు నిలిచి నానిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో ఇప్పటివరకు సుమారు 20వేల ఎకరాల్లో వరి సాగు చేయగా అందులో కొంతమేర కోత కోయించి ధాన్యం మిల్లుకు తరలించారు. మరికొన్ని ఎకరాల్లో కోతకు కోసి కుప్పలు వేయగా కొంతమేర కోతకోసిన వరి పనలపై ఉంది. ఈ తరుణంలో వర్షం పెరిగితే నీరు నిలిచి పనలపై ఉన్న ధాన్యం తడిసి నష్టం వాటిల్లుతుందని రైతులు భయపడుతున్నారు.

రైతులకు నష్టమే..

కూచిపూడి: ఫెంగల్ తుఫాను కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు కంటిపై కనుకు లేకుండా చేశాయి. కోతలు కోసి పనలపైనున్న పంటకు మొక్క మొలిచే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గాలులకు వందలాది ఎకరాల్లో వరి పంట నేలకొరింది. రైతులకు అదనపు ఖర్చులతోపాటు నష్టం కూడా అధికంగానే ఉంటుందని వాపోతున్నారు. 2వ పైరుగా చల్లిన మినప విత్తనాలు సైతం దెబ్బతినే అవకాశం ఉంది. కుప్పలు నూర్చి రాశులుగా పోసిన ధాన్యం, కాటాలు వేసి ఉన్న ధాన్యంతోపాటు కోతలు కోయాల్సిన వరి పొలాలు వివిధ దశల్లో ఉన్న పంటకు ఎటు చూసినా రైతులకు కడగండ్లే మిగిల్చింది.



కూచిపూడిలో పనల మీద ఉన్న వరి పంట

టార్పాలిన్ల కోసం రైతుల ఆందోళన

పామర్రు: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తీరం దాటినప్పటికీ దాని ప్రభావం దృష్ట్యా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలుగ్రామాల్లో తమ పంట ఉత్పత్తులను రక్షించుకోవడానికి రైతులు తీవ్రమైన కష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం పంట రక్షణకు అవసరమైన టార్పాలిన్లు అందించడంలో విఫలమైందని రైతులు ఆరోపిస్తున్నారు. ఆదివారం కురుస్తున్న వర్షానికి మండల వ్యాప్తంగా పలుగ్రామాల్లో యంత్రాల ద్వారా నూర్పిళ్లు పూర్తిచేసుకున్న ధాన్యం రాశులు రోడ్లపై ఆరాబెట్టుకున్నారు. వాటిని లారీల్లో లోడింగ్ చేసుకునేందుకు వర్షం అడ్డుగా నిలుస్తోంది. వర్షం నుంచి వాటిని కాపాడుకునేందుకు పరదాలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. మొత్తం 15 ఆర్ఎస్‌కేలకు గాను 4 ఆర్ఎస్‌కేలకు మాత్రమే ప్రభుత్వం టార్పిలిన్లు సరఫరా చేసిందని రైతులు వాపోయారు. మిగిలిన గ్రామాల్లో రైతులు పొరుగు గ్రామాలకు పోయి టార్పిలిన్లు అద్దెకు తేవడం కష్టంతోకూడిన పనిగా ఉందని ఆవేదన చెందుతున్నారు. దీనిపై తహసీల్దార్ జి.రవికాంత్ వివరణనిస్తూ ప్రభుత్వం నుంచి సరాఫరా అయిన 140 టార్పిలిన్లను పామర్రు, అడ్డాడ, పెదమద్దాలి, కనుమూరు గ్రామాల్లోని ఆర్ఎస్‌కేలకు అందించామన్నారు. అయితే తుఫాను ప్రభావం మన ప్రాంతానికి తక్కువగానే ఉందని, రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. ఇప్పటికే మండలంలో ధాన్యం లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న రైతులకు అవసరమైన లారీలను పంపించామన్నారు.

మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేయాలి

వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున రైస్ మిల్లర్లు రైతుల నుంచి వచ్చే ధాన్యం త్వరగా దిగుమతులు చేసి ప్రభుత్వానికి, రైతులకు సహకరించాలని తహసీల్దార్ జి.రవికాంత్ కోరారు. పామర్రు పరిధిలో ఆయన పలు రైస్‌మిల్లులను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతు సేవా కేంద్రాల నుంచి మిల్లులకు వచ్చిన ధాన్యం వెంటనే అన్‌లోడ్ జరిగేందుకు అవసరమైన హమాలీలను ఏర్పాటు చేసుకుని సహకరించాలన్నారు. దళారులను నమ్మి ధాన్యం తొందరపడి రైతులు అమ్మకాలు చేయరాదన్నారు. రైతులు ఏ రైస్ మిల్లులోనైనా తమ ధాన్యం విక్రయించుకోవచ్చునన్నారు. పీడీఎస్‌డీటీ రంగారావు, ఆర్ఐ రాము పాల్గొన్నారు.



పెదపారుపూడిలో రోడ్డుపై ధాన్యం ఆరబెడుతున్న రైతులు

రైతులు అప్రమత్తంగా ఉండండి: ఏవో

పెదపారుపూడి: ఫెంగల్ తుఫాన్ కారణంగా వాతావరణం ఆకాశంలో మబ్బులు ఏర్పడి కొద్దిపాటి వర్షపు జల్లులు కురవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఆదివారం విషయమై మండల వ్యవసాయశాఖాధికారి ఆంజనేయరావు మాట్లాడుతూ ప్రస్తుతం తుఫాను ప్రభావం మండలంలో లేకపోయినా వాతావరణంలో మార్పులు కారణంగా రైతులు ధాన్యపు రాశులను జాగ్రత్త చేసుకునే ప్రయత్నం చేయాలన్నారు. వాతావరణం చూసుకుని హార్వెస్టర్ (కోత మిషన్) ద్వారా గానీ, వ్యవసాయ కూలీలతో కానీ, వరి కోత విషయంలో ఆలోచన చేయాలని ఆయన రైతులకు సూచించారు.





ఉచిత మెగా వైద్య శిబిరాల్లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత మెగా వైద్యశిబిరం

గుడివాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక అక్కినేని నాగేశ్వరరావు పాలకవర్గ వ్యవస్థాపక కార్యదర్శి దివంగత కాజ వెంకట్రామయ్య జ్ఞాపకార్థం విజయవాడలోని పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ సౌజన్యంతో ఆసుపత్రి గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని కళాశాల పాలకవర్గ కార్యదర్శి కేఎస్ అప్పారావు ప్రారంభించారు. వైద్యులు డాక్టర్ నాగకిరణ్, డాక్టర్ జొన్నలగడ్డ శైలజ, డాక్టర్ కాజ హర్షిత, డాక్టర్ మౌర్య, డాక్టర్ జోత్స్న గుండె, మెదడు, నరాలు, కిడ్నీలు, ఎముకుల, కీళ్ల, యూరాలజీ, గైనిక్ విభాగాల్లో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు ఎల్ఆర్‌కే ప్రసాద్, కోశాధికారి పర్వతనేని కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, అధ్యాపకులు నాగేంద్రకుమార్, వీర్ల గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రభావతి గార్డెన్స్‌లో..

స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని డాక్టర్ ప్రభావతి గార్డెన్స్‌లో డాక్టర్ తిపిర్నేని లక్ష్మీపెరుమాళ్లు, ప్రభావతి, దివంగత చలసాని రాయన్ చౌదరి జ్ఞాపకార్థం రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల, పెద అవుటపల్లి వారిచే ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో క్లబ్ కౌన్సిలర్, రొటేరియన్ డాక్టర్ పి.విశ్వేశ్వర రావు 105 మంది కంటి సమస్యలతో బాధపడుతున్నవారికి పరీక్షలు నిర్వహించి, అర్హులకు ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. డాక్టర్ ఎం.ప్రసాద్, డాక్టర్ కె.ధనుష్, డాక్టర్ సి.హెచ్.వి అశోక్, డాక్టర్ వై.గణేష్, డాక్టర్ ఎం.తేజస్వినీ వైద్య సేవలందించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు టీఎన్ రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణ్ బాబు, సెలక్ట్ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, పూర్వ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, ఏ సుబ్రహ్మణ్యేశ్వర రావు, సభ్యులు రామిరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు అవసరమైనన్ని గన్నీ బ్యాగులు

● ఏవో బోలెం అనంతలక్ష్మి

గుడివాడ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన మేర గన్నీ బ్యాగ్‌లు సరఫరా చేస్తున్నట్టు ఏవో అనంతలక్ష్మి తెలిపారు. ఆదివారం ఏవో బిళ్లపాడు, రామన్నపూడి, లింగవరం, బొమ్ములూరు తదితర గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఎక్కడ సంచులు కావాలో వివరాలు తెలుసుకుని మిల్లర్లతో మాట్లాడి గన్నీ బ్యాగ్‌లు సరఫరా చేయాలని కోరారు. లింగవరంలోని ధాన్యం బస్తాలను మిల్లర్లతో మాట్లాడి లారీలో తరలించే ఏర్పాట్లు చేశారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ అధికారులు పర్యటించి వారి సమస్యలు పరిష్కరించటానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. వర్షాలు పడుతున్నందున వరి పంటను తొందరపడి మిషన్ల ద్వారా కోసుకోవద్దని రైతులకు సూచించారు. వర్షం తగ్గిన తర్వాత కోసుకోవాలని సూచించారు. ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించి ప్రతి రైతుకు న్యాయం జరిగేలా సిబ్బంది ద్వారా మిల్లులకు తరలించటానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మండల విస్తరణాధికారి వి.అనంతలక్ష్మి, వీఏఏ దినేష్, లింగవరం రైతులు గాదె రెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ధాన్యాన్ని లారీల్లో మిల్లులకు తరలిస్తున్న ఏవో బోలెం అనంతలక్ష్మి

మండలంలో 96శాతం పింఛన్ల పంపిణీ

గుడివాడ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో 96 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంఈడీవో డి.వై.విష్ణుప్రసాద్ తెలిపారు. 5వేలకుపైగా వివిధ రకాల పింఛన్ దారులు ఉన్నారని, రూ.2కోట్ల 20 లక్షలకు పైగా పింఛన్ల నగదు పంపిణీ చేశామన్నారు.

వర్షం కారణంగా కొంత ఆలస్యమైందని, మిగిలిన వారందరికీ మొత్తం పంపిణీ చేస్తామని, తమ సిబ్బంది వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పింఛన్ల పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే వెనిగండ్ల జన్మదిన వేడుకలు





స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, నందివాడలో కేక్ కట్ చేసి రావికి తినిపిస్తున్న రాము

గుడివాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. శనివారం అర్ధరాత్రి స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో అభిమానులు, టీడీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం తల్లి శాంతమ్మ ఆశీస్సులు తీసుకున్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు ఆత్మీయ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థాన ఈవో ఆకుల కొండలరావు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ దేవస్థానాల ఈవోలు, సిబ్బంది, సర్కిల్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, అగ్నిమాపక శాఖ ఫైర్ ఆఫీసర్ అంజనేయులు, ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పూలమొక్కలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్టేడియంలో కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో 'మము పాలింపగా నడచివచ్చితివ రామా'అనే పుస్తకాన్ని వెనిగండ్ల ఆవిష్కరించారు. స్థానిక గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జనసేన నేత కందుల రవి సమకూర్చిన 10వ తరగతి స్టడీ మెటిరియల్‌ను టీడీపీ నేతలు కామేపల్లి తులసీబాబు విద్యార్థులకు అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డస్ట్ కలెక్షన్ ట్రాలీలు, డంపర్ బాక్సులను ఎమ్మెల్యే వెనిగండ్ల ప్రారంభించి పారిశుధ్య కార్మికులకు అందజేశారు. రామన్న డైహార్డ్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జీవోస్ హోంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వెనిగండ్ల ప్రారంభించారు. స్థానిక సత్యనారాయణపురంలో జనసేన నేత సందు పవన్ ఆధ్వర్యంలో అన్నదానాన్ని ఆయన ప్రారంభించారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి, నేతలు కడియాల గణేష్, పంచకర్ల మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే వెనిగండ్ల కట్ చేశారు. విశ్వభారతి విద్యాసంస్థల ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, అర్బన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జీ, కూటమి నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు శుభాకాంక్షలు తెలిపారు.

నందివాడలో..

నందివాడ: ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జన్మదిన వేడుకల్లో భాగంగా నందివాడలో టీడీపీ మండలాధ్యక్షులు దానేటి సన్యాసిరావు, కార్యదర్శి నంబూరి రాకేష్, చాట్రగడ్డ రవి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సన్మాన సభలో వెనిగండ్ల రాము అన్నారు. ఈ సందర్భంగా ముందుగా కేక్ కట్ చేసిన అనంతరం రావి మాట్లాడుతూ ఎమ్మెల్యే వెనిగండ్లపై ఎంతో బాధ్యతుందన్నారు. పిన్నమనేని మాట్లాడుతూ రాము గతంలో వలే కాకుండా కూటమి ప్రభుత్వం అండదండలతో ఎంతో అభివృద్ధి చేయాలన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, పిన్నమనేని పూర్ణవీరయ్య (బాబ్జి), కొల్లూరి సత్యనారాయణ, టీడీపీ జిల్లా నేతలు, మండల నేతలు, టీడీపీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బొమ్ములూరు గ్రామంలో..

గుడివాడ రూరల్: ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జన్మదినం సందర్భంగా ఆదివారం రాత్రి బొమ్ములూరు గ్రామంలో టీడీపీ నేతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌కట్‌ను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కట్ చేశారు. పార్టీ రూరల్ మండలాధ్యక్షుడు వాసే మురళీ తదితరుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు పార్టీ నిర్వహించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణ, రూరల్ మండల నేతలు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు శొంఠి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ ఘనంగా నిర్వహించారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జన్మదిన వేడుకలు ఆదివారం రాత్రి గుడ్లవల్లేరు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల కార్యాలయం కొసరాజు వెంకటరామకృష్ణా రైస్‌మిల్ ఆవరణలో నిర్వహించిన ఈ వేడుకల్లో భారీకేక్‌ను ఏర్పాటు చేశారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, టీడీపీ గుడ్లవల్లేరు మండలాధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు తదితరులు రాము చేత కేక్ కట్ చేయించారు. అనంతరం భారీ గజమాలతో సన్మానించారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీ కొడాలి రామరాజు, వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, చాపరాల బాలాజీ, వల్లభనేని కృష్ణప్రసాద్ (నాని), మల్లిపెద్ది సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి, రాజేష్, పొట్లూరి రవికుమార్, షేక్ జాని, జంగం మోహనరావు, పోలవరపు వెంకటరావు, వీరమాచనేని శివప్రసాద్, అడుసుమిల్లి రామ్మోహనరావు, బెల్లంకొండ ఏడుకొండలు, యెనిగళ్ల నాగేశ్వరరావు, పెన్నేరు రమేష్, మాదాసు శ్రీను, బొప్పన శివప్రసాద్ పాల్గొన్నారు.





గుడ్లవల్లేరు, బొమ్ములూరులో భారీకేక్‌ను కట్ చేస్తున్న వెనిగండ్ల రాము, చిత్రంలో రావి వెంకటేశ్వరరావు



నవరసాల నందమూరి బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

మహనీయులను స్మరించుకోవడమే నిజమైన నివాళి

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పమిడిముక్కల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మధుర గాయకుడు ఘంటసాల, తెలుగువారి కీర్తిప్రతిష్టలు ప్రపంచ నలుదిశలా చాటిన మహానేత ఎన్టీఆర్ కృష్ణాజిల్లాకు చెందినవారు కావడం గర్వకారణమని, ఆ మహనీయులను మరువకుండా స్మరించుకోవడం వారికిచ్చే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే కుమార్‌రాజా అన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి పద్మశ్రీ ఘంటసాల, పద్మశ్రీ ఎన్టీఆర్ స్మారక కళాపీఠం 6వ వార్షికోత్సవం పురస్కరించుకుని మంటాడ ఎంపీపీ స్కూల్ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన 102 పాటల స్వరాభిషేకానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాపీఠం మురళీకృష్ణ, కార్యవర్గ సభ్యులు పరమేశ్వరరావు, మధుసూదనరావు, సర్పంచ్ వీరమ్మ, ఎంపీటీసీ రాజేశ్వరి, జనసేన నేత భవాని, టీడీపీ సీనియర్ నేత జక్కా శ్రీనివాసరావు, బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు

గుడివాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5నుంచి 15వరకు కోయంబత్తూరులో జరిగే 62వ జాతీయ స్కేటింగ్ హాకీ పోటీలకు స్థానిక డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. క్యాడెట్ బాలుర విభాగంలో డి.జోహిత్ వర్మ, ఎమ్ రిషాన్, బాలికల విభాగంలో జి.దివిష, పి.కారుణ్య, సబ్ జూనియర్ బాలుర విభాగంలో ఎస్.ఎన్ అభిలాష్, జూనియర్ బాలికల్లో ఈ.నిఖిల ఎంపికైనట్టు తెలిపారు. విద్యార్థులు, కోచ్ అయ్యప్పను ప్రిన్సిపాల్స్ సత్యరామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

గురజాడకు ఘనంగా నివాళులు

గుడివాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కామ్రేడ్ సుందరయ్య భవన్‌లో ఐద్వా పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురజాడ వెంకట అప్పారావు 109వ వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. తొలుత గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహితీ స్రవంతి పట్టణ అధ్యక్షుడు లంకా సురేంద్ర మాట్లాడుతూ అప్పారావు జీవితంలో అనుభవాలను కన్యాశుల్కం నాటిక ఇప్పటికీ ప్రజాదరణ తగ్గలేదన్నారు. ఆయన రచించిన దేశమును ప్రేమించుమన్న గేయాన్ని జాతీయ గీతంగా ప్రకటించాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి, ఐద్వా కార్యదర్శి పి.రజిని, నేతలు టి.లక్ష్మణరావు, ఎ.విజయకుమార్, సురేష్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

EDUCATION

శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA, ✆ 99493 08940

AJB-225661

TOURS & TRAVELS

★ మహాదేవ టూర్స్ : కాశీ యాత్ర 17/2, 2/3, ముక్తినాథ్ 14/3, ఛార్ ధాం 4/5 @ సంప్రదించండి : 9676637578

AJH-1386

WANTED

బ్యాంకు అనుబంధ సంస్థకు రిటైర్డ్, VRS, స్టేట్ మరియు సెంట్రల్ ఎంప్లాయిస్, టీచర్స్, రియల్ ఎస్టేట్ వారు కావలెను. వ : 35-70, Q: 10th, జీ : 12-15వేలు, సంప్ర॥ 6304181391.

AJG-9629

★ Need Principal for a Junior & Degree College and Coaching Institute - with Good Communication Skills and Experience - Good Salary - Contact : 8714456669

AJH-723

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం

REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT

GST 5%

రూ॥ 220/-

కలర్ 30% EXTRA

మచిలీపట్నం : 99854 11610, గుడివాడ : 99854 09737, చల్లపల్లి : 99854 11331, మైలవరం : 99854 00421, నందిగామ : 99854 11620, నూజివీడు : 99854 02464 తిరువూరు : 99854 09207, ఉయ్యూరు, పామర్రు : 99854 09737

మీ కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా తెలియజేయండి.

లీగల్ ప్రకటనలు

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

ఎటువంటి ప్రకటనకైనా ఆంధ్రజ్యోతిని సంప్రదించండి.

జన్మదిన, వార్షికోత్సవ శుభాకాంక్షలు

అంతిమయాత్ర, వర్ధంతి, జయంతి

క్లాసిఫైడ్స్

పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 01166

మచిలీపట్నం, పెడన : 99854 11610, చల్లపల్లి : 99854 11331, గుడివాడ : 99854 09737, ఉయ్యూరు, పామర్రు : 99854 09737



బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.620

హంసలదీవి బీచ్ గేట్లు మూసివేత



కోడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వాయు గుండం కారణంగా హంసలదీవి బీచ్ గేట్లు మూసివేస్తున్నట్లు మెరైన్ సీఐ సురేష్ రెడ్డి ఆదివారం తెలిపారు. పాలకాయితిప్ప కరకట్ట వద్ద గేట్లను మూసివేసి మెరైన్ సిబ్బందిని కాపలాగా ఉంచినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి గేట్లు తెరిచేంత వరకు సందర్శకులు గమనించి సహకరించాలని కోరారు.



ఉచిత బస్సులో పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి ఆలయ సందర్శనకు వెళ్తున్న భక్తులు

మోపిదేవి నుంచి పెదకళ్లేపల్లికి ప్రత్యేక బస్సు

మోపిదేవి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నుంచి పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామివారి దర్శనం నిమిత్తం పెదకళ్లేపల్లికి చెందిన అరజా కిరణ్‌కాంత్ సహకారంతో ఉచిత బస్సు సర్వీసు ఏర్పాటు చేశారు. ఈ సర్వీసుకు భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. అవనిగడ్డకి చెందిన ఎస్‌వీఎల్.క్రాంతి కళాశాలల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు బస్సును ఏర్పాటు చేయ గా, కిరణ్‌కాంత్ సొంత ఖర్చుతో బస్సును ప్రతి ఆదివారం మోపిదేవి నుంచి పెదకళ్లేపల్లి పుణ్యక్షేత్రాల సందర్శనకు ఏర్పాటు చేశా రు. ప్రతి ఆదివారం 200 మందికిపైగా భక్తులు మోపిదేవి, పెదకళ్లేపల్లి ఆలయాలను సందర్శించి తిరిగి మోపిదేవి చేరుకుంటున్నారు.



బాబాప్రసాద్‌కు ఎమ్మెల్యే కాగిత పరామర్శ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సతీ వియోగానికి గురైన మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్‌ను ఆదివారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పరామర్శించారు. బాబా ప్రసాద్ సతీమణి శ్రీదేవి చిత్రపటానికి ఎమ్మెల్యే కాగిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబాప్రసాద్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సుధాగోల్డ్ చైర్మన్ సాధు మురళికి పరామర్శ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సుధాగోల్డ్ ఎండీ సాధు మాల్యాద్రి మృతి పట్ల ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. మాల్యాద్రి చిత్రపటానికి ఆదివారం ఇమిటేషన్ జ్యూయలరీ అసోసియేషన్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాల్యాద్రి సోదరుడు, సుధాగోల్డ్ చైర్మన్ సాధు మురళిని ఇమిటేషన్ జ్యూయలరీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చలమలశెట్టి నరసింహారావు, అధ్యక్షుడు పి.సుబ్బారావు, సువర్ణ కల్యాణ మండపం పాలకవర్గ అధ్యక్షుడు ఆలపాటి రమేష్ తదితరులు పరామర్శించారు. మాల్యాద్రి మృతి రోల్డుగోల్డు పరిశ్రమకు తీరనిలోటని మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు సంతాపం వ్యక్తం చేశారు.



సత్యసాయిబాబా నగరోత్సవం, సంకీర్తన

ఘనంగా సత్య సాయిబాబా శతజయంతి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. నగర సంకీర్తన చేశారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, రాష్ట్ర సేవాదళ్ సమన్వయకర్త శ్యామ్‌ప్రసాద్, మచిలీపట్నం కన్వీనర్ ఆంజనేయకుమార్, ప్రగతి విద్యాసంస్థల అధినేత పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

డీపీటీవో, డీఎంపై చర్యలు తీసుకోవాలి : మజ్దూర్ సంఘ్

అవనిగడ్డ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ ఆర్టీసీ డిపో డ్రైవర్ మహేష్‌బాబు ఆత్మహత్యాయత్నానికి కారకులైన డీపీటీవో, డిపో మేనేజర్లపై చర్యలు తీసుకోవాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.వి.రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు ఒక ప్రకనటలో డిమాండ్ చేశారు. కరకట్ట రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు, గుంతలు కారణంగా నిర్దేశించిన రన్నింగ్ టైమ్ సరిపోవటం లేదని, దీంతో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సు నెంబర్ 0161 సూపర్ లగ్జరీ బస్సు ఇప్పటికే 15.40 లక్షల కిలోమీటర్లు తిరిగిందని, ఆ బస్సుకు అనేక సాంకేతిక లోపాలు ఉన్నా, డిపో మేనేజర్ మరమ్మతులు చేయించకుండా సర్వీస్‌ను కొనసాగించటంతో ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదానికి కారణాలు పరిశీలించకుండా డ్రైవర్‌ను డీపీటీవో దూషించటం వల్లే డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు.



చల్లపల్లి మండలం పాగోలులో నేలవాలిన వరి



కప్తానుపాలెం వద్ద వర్షానికి పట్టాల కిందకు నీరు వెళ్లి తడిసిన ధాన్యం



కోడూరు మండలం మందపాకలలో నేలకొరిగిన వరి

ఆగని వర్షం..రైతుకు కష్టం

చల్లపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావిత వర్షం రైతులకు కష్టాలు తెచ్చిపెడుతోంది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు వర్షం కురుస్తూనే ఉండటం మరింత ఆందోళనకు గురి చేసింది. ఇక్కడితో వర్షం ఆగితే చాలనుకుంటూ రైతులు ఆదివారం ధాన్యం ఆరబోసుకునే పనిలో ఉండగా, మధ్యాహ్నం మళ్లీ వర్షం కురవటంతో మళ్లీ ఉరుకులు, పరుగులు తీయాల్సివచ్చింది. మిషన్ కోత కోయడంతో ధాన్యం తరలించడానికి ఇబ్బందులు ఒకటైతే, గాలులకు వరిచేలు నేలవాలటం మరో సమస్యగా మారింది. చల్లపల్లి మండలం లక్ష్మీపురం, చింతలమడ, పాగోలు, పురిటిగడ్డ, చల్లపల్లి, మేకావారిపాలెం తదితర గ్రామాల్లో కోతకు సిద్ధమైన వరిచేలు గాలులకు నేలవాలాయి. ఆ పొలాల్లో వరికోతలు జరగాలన్నా, మిషన్ కోతకోసి నూర్పిడి చేయాలన్నా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. పూర్తిగా ఆరిన తర్వాత నేలవాలిన వరిని కూలీలతో పైకి లేపి దారులు వేసుకోవాల్సి ఉంటుంది. దీంతో కోతలు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

> తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా వర్షం పడుతూనే ఉంది. దివిసీమ రైతు పుట్టెడు కష్టాల్లో మునిగిపోయాడు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో మిషన్ కోతకోసి ధాన్యాన్ని కల్లాల్లో, రోడ్లపైన ఆరబెట్టారు. తేమశాతం నిబంధనతో ధాన్యం రాశులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వాన కురుస్తూనే ఉండడంతో ధాన్యం రాశుల కిందకు నీరు చేరి తడిసాయి. మిషన్‌కోత కోసిన రైతు కష్టాలు ఇలా ఉంటే, కోత కోయని వరి గాలివానకు పూర్తిగా నేలవాలింది. దీనిని మిషన్‌తో కోయడం కుదరదు. కూలీలతో కోత కోయించాలి. కూలి ఖర్చులు పెరిగిపోతాయి. పూర్తి పంట చేతికి రాదు. ఆరుగాల కష్టపడి పంట పండిస్తే చేతికందే సమయంలో వానొచ్చి రైతును కష్టాల పాల్జేసింది. తడిసిన ధాన్యం సాకుతో మిల్లర్లు, దళారులు దోచుకోవడం షరామామూలే. ఈ పరిస్థితుల్లో నిబంధనలు పూర్తిగా సడలించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



వెంకటాపురం వద్ద గుట్టలుగా పోసి పట్టాలు కప్పి ఉంచిన ధాన్యం

రహదారులపైనే ధాన్యం రాశులు

మోపిదేవి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు ఆదివారం కూడా కొనసాగుతుండటంతో యంత్రాలతో కోసి నూర్చిన ధాన్యం రహదారుల వెంబడి రాశులుగానే ఉన్నాయి. మండలంలోని పెదప్రోలు, కొక్కిలిగడ్డ, వెంకటాపురం తదితర గ్రామాల్లో యంత్రాలతో వరి కోత కోసి నూర్పిడి చేశారు. కోసిన ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టి వర్షం నుంచి కాపాడుకునేందుకు ఖాళీ స్థలాలు లేకపోవటంతో రహదారుల వెంబడి గుట్టలుగా పోసి పరదాలు కప్పుతున్నా రు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో పట్టాల్లో నుంచి వర్షపునీరు వెళ్లి ధాన్యం రాశులు తడుస్తున్నా యి. ఆదివారం ఉదయం కొద్దిసేపు వర్షం ఆగటంతో పట్టాలు తీసి ధాన్యాన్ని ఆరబెట్టే ప్రయత్నం చేస్తుండగానే మధ్యాహ్న సమయం నుంచి వర్షం తిరిగి ప్రారంభమైంది. ప్రభుత్వం ధాన్యం నిల్వ చేసుకునేందుకు సౌకర్యాలు కల్పించాలని, తేమ శాతం నిబంధనలు సడలించి గిట్టుబాటు ధరతో ధాన్యం కొనుగోలు చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

కోడూరులో నేల కొరిగిన వరి

కోడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా వీస్తున్న ఈదురుగాలులకు వరి చేలు నేలకొరిగాయి. మండల పరిధిలోని సుమారు 15 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ ఏడాది ఎకరానికి 40 బస్తాలు దిగుబడి వస్తుందని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్న తరుణంలో తుఫాన్ ప్రభావంతో వరి నేలకొరిగిపోవటంతో ఆందోళన చెందుతున్నారు. కోడూరు, నరసింహాపురం, లింగారెడ్డిపాలెం, మాచవరం, వి.కొత్తపాలెం, నక్కవానిదారి, ఉల్లిపాలెం గ్రామాల పరిసర ప్రాంతాల్లో 40 శాతం వరి పొలాలు నేలకొరిగాయి. మరో రెండు రోజుల పాటు వాతావరణం ఇలాగే ఉంటే దిగుబడి తగ్గిపోయి నష్టపోవాల్సి వస్తుందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతుకు తీవ్ర అన్యాయం

టీడీపీ నేత దోనేపూడి గోపీకృష్ణ ఆవేదన



ఘంటసాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లలో రైతు కు తీవ్ర అన్యాయం జరుగుతోందని శ్రీకాకుళం డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ అధ్యక్షులు, టీడీపీ నేత దోనేపూడి గోపీకృష్ణ పేర్కొన్నారు. దేవరకోట గ్రామంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ తనకున్న 20 ఎకరాల్లో తొమ్మి ది ఎకరాల్లో 1061, పది ఎకరాల్లో 1262 రకాలను సాగు చేసినట్లు తెలిపారు. తేమశాతంతో సంబంధం లేకుండా 1061 రకం ధాన్యా న్ని రూ.1500 లకు కొనుగోలు చేస్తానని చెప్పి బస్తాకు 75 కేజీల కాటా వేయాల్సి ఉండగా, మిల్లర్ 76 కేజీలు పడుతున్నారన్నారని, దీంతో రైతు బస్తాకు కేజీ నష్టపోతున్నట్లు తెలిపారు. 1262 రకం ధాన్యాన్ని కొనుగోలు చేసే వారే లేరన్నారు. గత ప్రభుత్వంలో తేమ శాతం ఉన్నా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేశారని, కూటమి ప్రభుత్వంలో మిల్లర్ తేమశాతాన్ని తెలియజేయకుండా తనకిష్టమొచ్చిన రేటు నిర్ణయించి కొనుగోళ్లు చేస్తున్నాడన్నారు. తాను టీడీపీ సానుభూతి పరుడనేనని, రైతుకు జరుగుతున్న అన్యాయం చూసి ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు. 1262 రకం ధాన్యానికి బస్తాకు రూ.1400 రేటు నిర్ణయిస్తున్నారని, కానీ ఆ రేటుకు తాను అమ్మటం ఇష్టలేక మద్దతు ధర వచ్చే వరకు నిల్వ చేస్తానన్నారు.

అన్ని రకాల ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలి

- మిల్లర్ల దోపిడీని అరికట్టాలి
- ఏపీ రైతు సంఘం డిమాండ్



వక్కలగడ్డ, కాసానగర్‌లో ధాన్యపు రాశులను పరిశీలిస్తున్న రైతు సంఘం నేతలు

చల్లపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మిల్లర్ల దోపిడీని అరికట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని, అన్నిరకాల ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి.ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో దివిసీమ ప్రాంతంలో ఇబ్బందులు పడుతున్న రైతాంగాన్ని రైతు సంఘం నేతల బృందం ఆదివారం పరామర్శించారు. కెవివి.ప్రసాద్ వక్కలగడ్డలో మీడియాతో మాట్లాడారు. రైతుల కష్టాన్ని ఆసరాగా చేసుకుని మిల్లర్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతంలోని రైతులు 1061, 1262, 1318, 1224 రకాల వరిని సాగుచేయగా రైస్ మిల్లర్లు 1061 రకం మాత్రమే కొనుగోలు చేసి మిగిలిన వాటిని కొనుగోలు చేయటం లేదనా ్నరు. ఆ రకాల ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలని ప్రశ్నించారు. ఈ సమస్యపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుసేవా కేంద్రం వద్ద నిర్ధారించిన తేమశాతం మిల్లర్ల వద్దకు వెళ్లగానే ఎందుకు పెరిగిపోతుందో అర్థం కావటం లేదన్నారు. రైతుల సమస్యలపై కలెక్టర్ దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. రైతుసంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, గుత్తికొండ రామారావు, అట్లూరి వెంకటేశ్వరరావు, మల్లిపెద్ది బోసు, మాలెంపాటి కోటేశ్వరరావు, నక్కా శ్రీను, కొల్లూరి శ్రీధర్, దాసరి గోపాలకృష్ణ, సాయిబాబు, అల్లూరి బాబూరావు, గోగినేని రత్తయ్య పాల్గొన్నారు.

మోపిదేవిలో పర్యటన

మోపిదేవి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి.ప్రసాద్ మండలంలోని పెదప్రోలు, కప్తానుపాలెం, కాసానగర్‌ల వద్ద తడిసి ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులను పరామర్శించారు. తక్షణమే రైతుల నుంచి కొనుగోలు చేసేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని సీపీఐ ప్రతినిధుల బృందం డిమాండ్ చేసింది. సీపీఐ, రైతు సంఘం నాయకులు మల్లుపెద్ది బోసు, మాలెంపాటి కోటేశ్వరరావు, నక్కా శ్రీను, కొల్లూరి శ్రీధర్ తదితరులు ఉన్నారు.



చల్లపల్లి రాజా కళాశాల పూర్వవిద్యార్థుల కార్తీక వనసమారాధన

చల్లపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నడకుదురు పృధ్వీశ్వర క్షేత్రం లో ఆదివారం చల్లపల్లి రా జా కళాశాల పూర్వవిద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన జరిగింది. విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు కేక్ కట్‌చేశారు. సాంబశివరావు మాస్టారు..రమ్య దంపతులను పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, సహపంక్తి భోజనాలు చేశారు. తొలుత పృధ్వీశ్వర స్వామిని దర్శించుకున్నారు.

శివాలయంలో వనసమారాధన

చల్లపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా చల్లపల్లిలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం వనసమారాధన జరిగింది. చల్లపల్లి ఎస్సై పి.సుబ్రహ్మణ్యం అన్నసమారాధనను ప్రారంభించారు. పెద్దలు అడపా రాంబాబు, గురవయ్య, పసుపులేటి మోహన్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



రామలింగేశ్వరస్వామి ఆలయంలో అఖండజ్యోతి ఉత్సవం

నాగాయలంక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరామపాదక్షేత్రం రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కర్పూర అఖండ జ్యోతులను హరహర మహాదేవా అంటూ వేద పండితులు, భక్తులు కలిసి వెలిగించారు. అయ్యప్ప భక్తులు, భవానీలు, శివస్వాములు పాల్గొన్నారు. గ్రామ ప్రముఖులు, భక్తులు విరివిగా తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు తదితరులు పర్య వేక్షించారు.

ప్రతి సోమవారం మీకోసం

బంటుమిల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మీ కోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరుగుతుందని తహసీల్దార్ భరత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10-30గంటలకు ప్రారంభం అయ్యే ఈ కార్యక్రమానికి మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు హాజరు అవుతారని తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ప్రజా సమస్యల పరిష్కార వేదికను వినియోగించుకోవాలని కోరారు.



జాతీయ రగ్బీ పోటీలకు పండు

పెడన, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-17 రగ్బీ పోటీలలో తోటమూల జడ్పీ హైస్కూల్‌కు చెందిన బొడ్డు పండు ఉత్తమ ప్రతిభ కనబరిచి బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పండును, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు గండు నరసింహారావును ప్రధానోపాధ్యాయుడు సిహెచ్. నాగేశ్వరరావు అభినందించారు.

వైభవంగా శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వేకనూరులో సూర్యనారాయణ శాంతి కల్యాణం పాకలపాటి రాము బ్రహ్మత్వంలో వైభవంగా జరిగింది. గుడివాక గోపాలకృష్ణ - విజయలక్ష్మి దంపతులు (కొంగలదిబ్బ) పీటల మీద కూర్చుని కల్యాణ క్రతువు నిర్వహించారు. పరుచూరు ప్రేమ్ బాబు ఆర్థిక సహకారంతో భక్తులకు అన్నదానం జరిగింది. ఆలయ నిర్వాహకులు తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయండి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జనవరి 5వ తేదీన జరిగే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా శాఖ అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్ కోరారు. అర్చకుల సమస్యలను, దేవాలయాల బాగోగులను చర్చిస్తామన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

నాగాయలంక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ నగర్‌లో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉప్పల ప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీసీ నేతర, టీడీపీ జిల్లా కార్యదర్శి లకనం నాగాంజనేయులు పాల్గొన్నారు. పిలేటి శ్రీను, మంచాల మహేంద్ర కుమార్, తలశిల నాని, మద్దూరి దుర్గ, చీరాల తుఫాను, బలుసుమిల్లి ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

చేతల్లో అభివృద్ధి చూపండి : సింహాద్రి

అవనిగడ్డ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాటలు కట్టి పెట్టి చేతల్లో అభివృద్ధి చూపించాలని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గడిచిన ఐదు నెలల కాలంలో ప్రభుత్వ పనితీరుపై ధ్వజమెత్తారు. బుద్ధప్రసాద్ బంధువుల కనుసన్నల్లోనే ఇసుక, బుసక అక్రమ దందా కొనసాగుతోందని ఆరోపించారు. నిబంధనలు తొలగించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సుమతిదేవి, లక్ష్మీనారాయణ, సింహాద్రి వెంకటేశ్వరరావు, జైగోపాల్, నజీర్ బాషా, బాలభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

EDUCATION
» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA, ✆ 99493 08940
AJB-225661

TOURS & TRAVELS
★ మహాదేవ టూర్స్ : కాశీ యాత్ర 17/2, 2/3, ముక్తినాథ్ 14/3, ఛార్ ధాం 4/5 @ సంప్రదించండి : 9676637578
AJH-1386

WANTED
→ బ్యాంకు అనుబంధ సంస్థకు రిటైర్డ్, VRS, స్టేట్ మరియు సెంట్రల్ ఎంప్లాయిస్, టీచర్స్, రియల్ ఎస్టేట్ వారు కావలెను. వ : 35-70, Q: 10th, జీ : 12-15వేలు, సంప్ర॥ 6304181391.
AJG-9629

★ Need Principal for a Junior & Degree College and Coaching Institute - with Good Communication Skills and Experience - Good Salary - Contact : 8714456669
AJH-723

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, ఇట్టి వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE · SITUATION VACANT · TO LET · AUTOMOTIVE · COMPUTERS · HEALTH CARE · EDUCATION · ENTERTAINMENT
రూ.220/-
మచిలీపట్నం: 99854 11610, గుడివాడ: 99854 09737, చల్లపల్లి: 99854 11331, పెడన: 99854 00421, నందిగామ: 99854 11620, నూజివీడు: 99854 02464, తిరువూరు: 99854 09207, ఉయ్యూరు, పామర్రు: 99854 09737
30% EXTRA

మీ కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా తెలియజేయండి.
లీగల్ ప్రకటనలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన, వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఎటువంటి ప్రకటనకైనా ఆంధ్రజ్యోతి ని సంప్రదించండి.
అంతిమయాత్ర, వర్ధంతి, జయంతి
క్లాసిఫైడ్స్
పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 01166
మచిలీపట్నం, పెడన : 99854 11610,
చల్లపల్లి : 99854 11331, గుడివాడ : 99854 09737,
ఉయ్యూరు, పామర్రు : 99854 09737

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 11610, 99854 11331

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234